
ఈనాడు
ఆదివారం
6 జులై 2025



స్వర్ణగిరి... మరో సప్తగిరి!



పొట్టవిప్పితే... మైక్రోప్లాస్టిక్!



తెలిసే అప్పుడు బరువు పెరిగా!



మహిళా ప్రాధాన్యమున్న పాత్రలకు పెట్టింది పేరు అనుష్క. చేసే ప్రతి సినిమాలో తనదైన ముద్ర వేస్తూ ఇండస్ట్రీలో ప్రముఖ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ సొగసరి రెండేళ్ల విరామం తరువాత 'ఘాటీ' ద్వారా మరోసారి తెరమీద సందడి చేయబోతోంది. ఈ సందర్భంగా తనకు సంబంధించిన విషయాలను చెబుతోందిలా...

అందుకే బ్రేక్

వరుసగా సినిమాలు చేసేసరికి జీవితం రొటీన్‌గా అనిపించింది. అందుకే కాస్త విరామం తీసుకోవాలనుకున్నా. అప్పుడే నన్ను నేను ఇంకా రీఛార్జ్ చేసుకుని, మరిన్ని మంచి ప్రాజెక్టులపైన దృష్టి పెట్టొచ్చనిపించింది.

వెళ్లిపోవాలనుకున్నా

ఇండస్ట్రీకి వచ్చిన మొదటి ఏడాది... షూటింగ్ హడావుడి చూసి భయంగా అనిపించింది. అందుకే తిరిగి వెళ్లిపోయి, యోగానే నా వృత్తిగా మార్చుకోవాలనుకున్నా. ఎందుకంటే చదువుకుంటున్నంత కాలం నేను టీవీ కానీ, సినిమాలు కానీ పెద్దగా చూసింది లేదు.

గుర్తుండిపోయే సినిమా

'అరుంధతి'. అది నా కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, ఆ షూటింగ్‌లోనే ఎన్నో విషయాలూ నేర్చుకున్నా.

తొలి ప్రేమ

నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు అనుకుంటా. ఒక అబ్బాయి నేనంటే ఇష్టమని చెప్పాడు.

ఇప్పటికీ కంగారే!

షూటింగ్‌లో కెమెరా ముందు ఎంతసేపైనా నటిస్తా కానీ... ఎవరైనా స్టిల్‌కెమెరాతో వచ్చి 'స్మైల్' అంటే మాత్రం నాలో తెలియని కంగారు వచ్చేస్తుంది. ఫొటో తీస్తున్నప్పుడు అస్సలు నవ్వలేను.

ఇష్టంగానే నటించా...

నేను చేసిన 'సైజ్ జీరో' చాలామందికి నచ్చినా ఆ పాత్రకోసం బరువు పెరగడం, ఆ తర్వాత తగ్గడం... ఇలా చాలానే కష్టపడ్డా. మొదట ఆ టీమ్ ప్రోస్థెటిక్ మేకప్ ద్వారా నన్ను లావుగా చూపిస్తామని చెప్పింది. అలా ప్రయత్నించాం కూడా. అయితే స్క్రీన్‌మీద అనుకున్నట్లుగా కనిపించకపోవడంతో నేనే బరువుపెరుగుతానని అన్నా. ఒక యోగా టీచర్‌గా బరువు తగ్గడం చాలా కష్టమైన పని అని తెలిసినా కూడా వీలైనంతవరకూ అన్నం, కూరలు వంటివి తింటూనే ఇరవై కిలోలు పెరిగా. మొదట్లో ఏమీ అనిపించలేదు కానీ పరిగెడుతున్నప్పుడు కాస్త ఇబ్బంది పడేదాన్ని. నిజంగానే ఆ తర్వాత బరువు తగ్గడానికి చాలా కష్టపడ్డా.

అవి చూడను

'భాగమతి' చేసినా కూడా నేను హారర్ సినిమాలను అస్సలు చూడను.

ఇష్టమైన ఆహారం

నేను పుడీనే కానీ... ఇంటిభోజనాన్ని, అది కూడా అమ్మచేతి వంటను ఇష్టపడతా. ముఖ్యంగా ముద్ద పప్పు, పప్పుచారు ఉంటే... ఇంకేం అక్కర్లేదు.

వాటిని సేకరిస్తుంటా

నాకు ముందునుంచీ పత్రికల్లో వచ్చే- ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన వార్తలు కట్‌చేసి పెట్టుకోవడం అల వాటు. తర్వాత వాటన్నింటినీ స్క్రాప్‌బుక్‌లో అతికిస్తా.

ఊహించని అవకాశం

ఇండస్ట్రీలోకి వచ్చిన తొలి రోజుల్లో ఒకసారి రాఘవేంద్రరావుగారిని కలిశా. నా కెరీర్‌లో ఆయన దర్శకత్వంలో చేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ కొద్ది రోజులకే ఆయన తీసిన 'ఓం నమో వేంకటేశాయ'లో నాకు అవకాశం రావడం ఎప్పటికీ మర్చిపోను.



ఇష్టంగా చేసే పనులు

మా బాల్కనీలో నిల్చుని గంటల తరబడి ఆకాశంలోకి చూస్తూ గడపడం, వాకింగ్, సైక్లింగ్, ధ్యానం, ఏదో ఒక కొత్త ప్రాంతం చూడటం, పాటలు వినడం, పుస్తకాలు చదవడం... ఇష్టం. పౌలో కొయిలో రాసిన పుస్తకాలనూ ఇష్టంగా చదువుతా.

లోపల

మంచిమాట

విజ్ఞతతో మాట్లాడటం అంటే- సరైన సందర్భంలో సరైనది చెప్పడం కాదు, రెచ్చగొట్టిన సందర్భంలోనూ చెప్పకూడని విషయాన్ని చెప్పకపోవడం.

మీకు తెలుసా!


ఆ అడవి రాత్రి అయితే చాలు, నీలి రంగుని వెదజల్లుతూ దేదీప్యమానంగా వెలిగిపోతుంది. అందుకే దాన్ని 'బ్లూ ఘోస్ట్ ఫారెస్ట్' అంటారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉందీ చోటు. ఆ నీలిరంగు వెలుగులకి కారణం... దెయ్యాలేం కాదు, అక్కడి మిణుగురులు ప్రసరించే కాంతే. ఈ వింతని చూడ్డానికి ప్రపంచం నలుమూలల నుంచీ పర్యటకులు వస్తుంటారు.



అంతేగా..!

'తలకాయ ఉందా' అనడిగితే... కోప్పడకుండా సమాధానం చెప్పేవాడు ఒక్క మటన్‌షాపు అతను మాత్రమే!

బాస్మతి 'కోటు' ధర... రూ.1.75 లక్షలు!



'ఆ ఒక్కటీ అడక్కు...' రాజేంద్రప్రసాద్ హీరోగా చేసిన ఓ పాత సినిమా. అందులో హీరో- ఏదో ఆలోచనలో ఉండి, చేతిలోని ఫౌంటెయిన్ పెన్నుని యథాలాపంగా విదిలిస్తాడు. పెన్నులోని ఇంకు కాస్తా ఓ తెల్లటి బట్టమీద చుక్కలుగా పడుతుంది. ఆ డిజైన్ బావుందనిపించి హీరో అలాంటి షర్ట్‌లని మార్కెట్‌లో అమ్మితే 'అద్భుతం' అంటూ కాలేజీ యువత ఎగబడి కొంటారు. ప్రస్తుతం అమెరికాలో బాస్మతి బియ్యం గోనె సంచులకి అలాంటి మహర్దశే పట్టింది! ఆ దేశంలో మనదగ్గర్లాగే బాస్మతి బియ్యానికి విపరీతమైన డిమాండు ఉంది. చాలావరకూ ఇక్కడి నుంచే వాటిని దిగుమతి చేసుకుని... కొత్త బ్రాండ్ పేరుతో విక్రయిస్తుంటాయి అమెరికన్ కంపెనీలు. రాణి, రాయల్, ఆల్-అమీర్ వంటి బ్రాండ్‌లు చాలా ఫేమస్. కాకపోతే వాటిని అమెరికన్ కంపెనీలు గోనె బస్తాల్లోనే అమ్ముతున్నాయి. అలా వాడగా వృథాగా పడి ఉన్న ఆ సంచులతో కోటుల్ని తయారుచేసి కొన్నిషాపుల్లో పెట్టారు. మొదట ఎవరూ పెద్దగా పట్టించుకోలేదుకానీ చూస్తుండగానే వాటికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఐదువందల డాలర్లు ఉన్న ధర చూస్తుండగానే రెండువేల డాలర్లకి (సుమారు రూ.1.75 లక్షలు) పెరిగిందంటే చూసుకోండి!





వాళ్లింటి పేరు 'స్నేహం'

కేరళ తిరుచ్చూరులోని సెయింట్ మేరీస్ గర్ల్స్ హైస్కూలు అది. అక్కడ రిజ్వానా అనే పాప తొమ్మిదో తరగతి చదువుతోంది. ఓసారి వాళ్ల క్లాస్‌మేట్స్ అందరూ తన ఇంటికెళ్లారట... అది ఒక్క గది మాత్రమే ఉన్న ఇల్లు. వంటావార్పులకీ, రిజ్వానా- వాళ్లక్కా చదువుకోవడానికీ, టైలర్‌గా ఉన్న వాళ్ల నాన్న పనిచేసుకోవడానికీ... అంతా ఆ ఒక్క గదే! అతిథులుగా వాళ్లింటికెళ్లిన పిల్లలకేమో ఇంట్లో ప్రత్యేక బెడ్రూములే ఉన్నాయి! రిజ్వానా కుటుంబం మాత్రం ఇలా ఎందుకుండాలి అనిపించి... తమ నేస్తం కోసం కాస్త పెద్ద ఇల్లు కట్టివ్వాలని సంకల్పించుకున్నారు ఆ స్నేహితురాళ్లు. టీచర్లూ, పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి విరాళాలు సేకరించారు. 15 రోజుల్లోనే సుమారు 12 లక్షల రూపాయలు పోగుచేసి... టీచర్లకిస్తే వాళ్లు రిజ్వానా పాత ఇంటి స్థలంలోనే రెండు బెడ్రూమ్‌లతో కూడిన పెద్ద ఇల్లు కట్టించి ఇచ్చారు. రిజ్వానా వాళ్ల నాన్నకి అధునాతన టైలరింగ్ మెషిన్‌లూ ఇచ్చారు! ఈ విషయం తెలిసి రిజ్వానా స్నేహితురాళ్లందర్నీ కేరళలోని మలయాళ మనోరమ పత్రిక ఇటీవలే ఘనంగా సన్మానించింది. అన్నట్టు... రిజ్వానా కుటుంబం తమ ఇంటికి 'స్నేహవీడు'(మైత్రీ గృహం) అనే పేరుపెట్టుకుంది. ఎంత చక్కగా సరిపోయే పేరు కదా అది!

అవీ ఇవీ

ఆ పిల్లలకి ఫ్రీ 'కటింగ్'


పిల్లలకి హెయిర్ కటింగ్ చేయడానికి కనీసం నూటయాభై రూపాయలైనా అవుతోందిప్పుడు. దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులకి ఆపాటి డబ్బు ఆదా అయినా రెండురోజులకి సరిపడా వంటావార్పులకి వస్తుంది కదా! ఇదే ఆలోచించింది చెన్నైలోని 'ధనుష్ హెయిర్ సెలూన్' సంస్థ. దానికి ఆ నగరంలో మూడు బ్రాంచిలున్నాయి... అన్నీ ఏసీతో అత్యాధునిక వసతులతో కూడుకున్నవే. ఆ మూడు సెలూన్‌లలోనూ ప్రభుత్వ బడి పిల్లలకి ఉచితంగానే హెయిర్‌కట్ చేస్తున్నారు. గత పదేళ్లుగా దీన్నో సేవగానే భావిస్తున్నారు. ఈ సెలూన్‌లని తంగవేలూ, ఆయన భార్య విజయలక్ష్మీ నిర్వహిస్తున్నారు. మూడు బ్రాంచిలకీ దగ్గర్లో ఉన్న సర్కారు బడి పిల్లలు... ఒకటి నుంచి పన్నెండో తరగతిదాకా చదువుతున్న వాళ్లు ఎవరైనా సరే- వాళ్ల ఐడీ కార్డ్ చూపిస్తే చాలు, ఉచితంగా క్షురకర్మ చేస్తారు. అంతేకాదు... బడులు తెరిచే సమయంలోనైతే పుస్తకాలూ, పెన్నులూ, పెన్సిళ్లనూ అందిస్తారు. మెచ్చుకోవాల్సిన విషయమే... ఏమంటారు?



ఇవి... తలుపుల్లేని లైబ్రరీలు!



'నేటితరం పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవడం లేదు?' ...ఈ ప్రశ్నకు ఒక్కొక్కరూ ఒక్కో రకం జవాబు చెప్పొచ్చు కానీ... దిల్లీకి చెందిన ఈ యువబృందం మాత్రం అందుబాటులో పుస్తకాలు లేకపోవడమే కారణమని నమ్ముతోంది. ఓ సెల్‌ఫోనో టీవీ రిమోటో అందినంత ఈజీగా కొత్తతరం చేతికి పుస్తకాలు చేరడం లేదంటోంది. అందుకే వాళ్ల కోసం తలుపుల్లేని (ఓపెన్) లైబ్రరీలని ఏర్పాటుచేస్తోంది. దిల్లీ నలుమూలలా ఉన్న పార్కులూ, మురికివాడల దగ్గర ప్రతి ఆదివారం వందలాది పుస్తకాలని వరసగా పెడుతోంది. అక్కడికొచ్చిన వాళ్లు ఎవరైనా వాటిని తీసుకెళ్లొచ్చు, చదివాక తిరిగి తెచ్చియ్యొచ్చు. వేలరూపాయల ధర ఉన్న పుస్తకాలైనా సరే, ఒక్క రూపాయి కూడా డిపాజిట్‌గానో చందా కిందనో చెల్లించక్కర్లేదు. పుస్తకం ఎంత ఆలస్యంగా తిరిగిచ్చినా ఏమీ అనరు, జరిమానా అడగరు. ఆశ్చర్యకరంగా- తీసుకెళ్లే పుస్తకాల్లో రెండు శాతం తప్ప మిగతావన్నీ వెనక్కి వచ్చేస్తున్నాయని చెబుతోంది 'బుక్ ఇన్ హ్యాండ్ క్యాంపెయిన్(బీసీహెచ్)' పేరుతో ఈ లైబ్రరీలని ఏర్పాటుచేస్తున్న యువ బృందం. వీటికోసం ప్రతిసారీ ఐదువేల మంది దాకా వస్తున్నారట. ఎంత మంచి పరిణామమో కదా!





తెలుగువారు గర్వంగా తలెత్తుకోవాల్సిన సందర్భం ఇది! మనదేశం ఇప్పటిదాకా రూపొందించిన యుద్ధనౌకల్లో అత్యంత శక్తిమంతమైనదిగా చెబుతున్న... ఐఎన్ఎస్ తమాల్‌కి తొలి కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నారు శ్రీకాకుళానికి చెందిన శ్రీధర్ తాతా. రష్యాలో తయారైన ఆ యుద్ధనౌకని అక్కడి కలినిన్ గ్రాండ్ రేవు నుంచి మన జలాల్లోకి తీసుకువస్తున్నారాయన. తెలుగురాష్ట్రాల నుంచి వెళ్లిన ఓ సైనికాధికారికి దక్కిన అరుదైన గౌరవం ఇది. కానీ ఆ విజయం వెనక కంట తడిపెట్టించే ఓ భావోద్వేగ స్పర్శ కూడా ఉంది.



అతని విజయం వెనక... ఓ అమ్మ ఉంది!

కెప్టెన్ శ్రీధర్ కథ వాళ్ల అమ్మ పద్మావతి నుంచే మొదలుపెట్టాలి. ఆమె సొంతూరు బరంపురం. చిన్నప్పటి నుంచే చాలా చురుకూ ధైర్యవంతురాలని పేరు. ఆటల్లోనూ మేటి... డెబ్బైల్లోనే టీచర్‌గా పనిచేస్తుండేది. పద్మావతికి శ్రీకాకుళం జిల్లా హిరమండలం దగ్గర్లోని చొర్లంగి గ్రామానికి చెందిన తాతా శివరామభుక్తతో పెళ్లయ్యింది. ఆయన వైమానిక దళంలో సార్జెంట్. చొర్లంగిలో కాపురానికొచ్చిన కొద్దిరోజులకే ఆ ఊళ్లోవాళ్లందరికీ తలలో నాలుకయ్యిందామె. 1982లో వరద బీభత్సానికి చొర్లంగి గ్రామం మునిగిపోతే... అక్కడికొచ్చిన సీఎం వద్దకి తనొక్కతే వెళ్లి తమ పల్లె దైన్యాన్ని ధైర్యంగా వివరించి... నష్టపరిహారం అందేలా చూసిందట. శివరామ భక్త- పద్మావతి దంపతుల మూడో సంతానం... శ్రీధర్. వాళ్ల కుటుంబం విశాఖపట్నంలో కాపురం ఉన్నప్పుడే పెద్దబ్బాయి శ్రీనివాస్‌కి కోరుకొండ సైనిక్ స్కూల్లో సీటు వచ్చింది. రెండేళ్ల తరవాత చిన్నబ్బాయి శ్రీధర్ కూడా సైనిక్ స్కూల్‌కి వెళతానని పట్టుబట్టాడు. పెద్దవాణ్ణి సైనిక్ స్కూల్‌లో చదివించడానికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వచ్చిన ఆ తండ్రి... అందుకు ఒప్పుకోలేదుట. కానీ, పద్మావతికేమో శ్రీధర్ ఉత్సాహం పైన నీళ్లు చల్లడం ఇష్టం లేదు. పైగా శ్రీధర్ ఎలాంటి కోచింగ్ లేకుండానే సైనిక్ స్కూల్‌లో సీటు తెచ్చుకున్నాడు. ఓ వైపు మెట్టినింటి ఉమ్మడి కుటుంబం బాధ్యతలూ, మరోవైపు ఇద్దరు పిల్లల సైనిక్ స్కూలు శిక్షణకయ్యే ఖర్చులూ... వీటి మధ్య కత్తిమీద సాములా కుటుంబాన్ని నెట్టుకొచ్చిందామె.



కాలివేళ్లు తీసేయాలన్నారు...

కోరుకొండ స్కూల్లో పర్వతారోహణ శిక్షణలో భాగంగా ఓసారి ఉత్తరకాశీకి తీసుకెళ్లారు శ్రీధర్‌ని. అక్కడో కొండ శిఖరంపైన ఉన్నప్పుడు మంచుతుపాను ముంచెత్తింది. మూడురోజులపాటు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. నాలుగోరోజు కిందకు దిగాక శ్రీధర్ కాలి వేళ్లు స్పర్శ కోల్పోయాయి. పరీక్షిస్తే మంచు... కాలి వేళ్ల నరాలని ధ్వంసం చేసేసిందనీ (ఫ్రాస్ట్‌బైట్) వెంటనే వాటిని తీసేయాలనీ చెప్పారట. అదే జరిగితే... సైనికాధికారి కావాలన్న కల కల్లకావడం తథ్యం! దాంతో చివరి ప్రయత్నంగా బెంగళూరు వైమానికదళం ఆసుపత్రికి తీసుకొచ్చి హైపర్‌బేరిక్ ఆక్సిజన్ థెరపీ(హెచ్‌బీఓటీ) ఇప్పించాలనుకున్నారు. ఓ ఛాంబర్‌లో సముద్ర గర్భంలాంటి వాతావరణాన్ని సృష్టించి వందశాతం ఆక్సిజన్‌ని అందించే వినూత్న చికిత్స అది. ఆ చికిత్సకి- శ్రీధర్ పక్కనే ఉండి తల్లి పద్మావతి అందించిన మానసిక ధైర్యం కూడా తోడై అద్భుతమే జరిగింది. శ్రీధర్ సమస్య నుంచి బయట పడ్డాడు. తల్లి కోరికా తన లక్ష్యమూ అయిన ఎన్డీఏలో సీటు సాధించాడు. కానీ... 1996లో తల్లికి ఉదర క్యాన్సర్ ఉన్నట్టు తేలింది. వీలున్నన్ని రోజులు ఆమె దగ్గరే ఉండాలనుకున్నాడు శ్రీధర్. కానీ... ఎన్డీఏ నిబంధనలు అందుకు ఒప్పుకోలేదు. రెండుసార్లే రావడానికి వీలైంది. రెండోసారి శ్రీధర్ వచ్చి వెళ్లాక మృత్యు ఒడిలోకి జారిపోయిందామె. విషయం తెలిస్తే శిక్షణ నుంచి ఎక్కడ వచ్చేస్తాడోనని ఇంట్లోవాళ్లూ చెప్పలేదు. చివరికి- ఉండబట్టలేక వాళ్లన్నయ్య శ్రీనివాస్ ఆ విషాద వార్తని తమ్ముడికి చేరవేశాడు. ఎన్డీఏ ఉన్నతాధికారులు వెళ్లడానికి అనుమతించారు కానీ... అప్పటికే ఆలస్యమై పోయింది! శ్రీధర్‌కి చివరి చూపు కూడా దక్కకుండా... పద్మావతి అంత్యక్రియలు పూర్తయ్యాయి!

విజయ పరంపర...

ఆ విషాదాన్ని దిగమింగి... ఎన్డీఏ శిక్షణ ముగించారు శ్రీధర్. 1999లో సబ్ లెఫ్టినెంట్‌గా నౌకాదళంలో చేరారు. చేరిన వెంటనే 'ఆపరేషన్ విజయ్- కార్గిల్' యుద్ధంలో పాల్గొన్నారు. యుద్ధనౌకల్లో అత్యాధునిక ఆయుధాల వాడకంలో పట్టుసాధించారు. అరేబియా సముద్రంలో సోమాలియా సముద్రపు దొంగల ఆటకట్టించడంలో చురుకైన పాత్ర పోషించారు. అనేక నాయకత్వ స్థానాల్లో సామర్థ్యం చూపారు. 2022లో జాతీయ భద్రతా సలహా మండలి కింద ఏర్పాటైన 'మారిటైమ్ సెక్యూరిటీ వింగ్'కి తొలి వ్యవస్థాపక సభ్యుడు ఆయనే! నౌకాదళంలో 26 ఏళ్ల అనుభవమున్న శ్రీధర్- 12 యుద్ధనౌకల్లో సేవలందించినా, మూడింటికి కెప్టెన్‌గా వ్యవహరించినా... 'ఐఎన్ఎస్ తమాల్' సంగతి పూర్తిగా వేరు! బ్రహ్మోస్‌లాంటి సూపర్‌సోనిక్ క్షిపణుల్ని ప్రయోగించే 'అరివీర భయంకర' యుద్ధ నౌక అది. రష్యా, భారత్ సంయుక్తంగా ఎనిమిది వేల కోట్ల రూపాయలతో దీన్ని రూపొందించాయి. అందుకే- ఆ నౌక తొలి ప్రయాణాన్ని (కమిషనింగ్) ప్రతిష్ఠాత్మకంగానూ, దానికి కమాండర్‌గా వ్యవహరించడం అరుదైన గౌరవంగానూ భావిస్తున్నారు. ఆ గౌరవాన్ని అందుకున్న తొలి తెలుగు సైనికాధికారి కెప్టెన్ శ్రీధరే. అంతేకాదు, కోరుకొండ సైనిక్ స్కూల్ చరిత్రలోనూ ఈ స్థాయికి వెళ్లిన మొదటి వ్యక్తి కూడా ఆయనే!

- బొల్ల హరి సత్యనారాయణ, ఈనాడు, శ్రీకాకుళం



స్మార్ట్ నాప్కిన్లు

నెలసరి సమయంలో సౌకర్యం, పరిశుభ్రత కోసం మహిళలు శానిటరీ నాప్కిన్లు వాడుతుంటారు. అయితే, ఇవే నాప్కిన్ల సాయంతో ఆడవాళ్లకు భవిష్యత్తులో రాబోయే ఇన్‌ఫెక్షన్లూ, క్యాన్సర్లని కూడా గుర్తించగలిగితే ఎలా ఉంటుంది? సరిగ్గా ఇలాంటి ఆలోచనతోనే స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జ్యూరిచ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు 'ఏఐ మెనుస్ట్రు' పేరుతో స్మార్ట్ శానిటరీ నాప్కిన్లని ఆవిష్కరించారు. ఎటువంటి పరీక్షలూ లేకుండానే ఈ స్మార్ట్ నాప్కిన్ల సాయంతో నెలసరి రక్తాన్ని వాడి సులభంగా వ్యాధులని గుర్తించొచ్చు. అదెలా అంటే... శానిటరీ ప్యాడ్‌పైన కొన్ని ప్రత్యేకమైన స్ట్రిప్స్ ఉంటాయి. నెలసరి రక్తం తగలగానే శరీరంలో ఉన్న సమస్యలని బట్టి ఆ స్ట్రిప్స్ వేర్వేరు రంగుల్లోకి మారతాయి. ఈ స్ట్రిప్స్ యాప్‌తో కలిసి పనిచేయడం వల్ల వ్యాధుల తాలూకు సమాచారం మనకు మొబైల్ ద్వారా తెలిసిపోతుంది. ఈ స్మార్ట్ న్యాప్కిన్లని వాడి ఎండో మెట్రియోసిస్, ఒవేరియన్ తరహా క్యాన్సర్లని కూడా ముందుగా గుర్తించ వచ్చంటున్నారు శాస్త్రవేత్తలు.

పరిశోధన

ప్రీ-స్కూల్‌కి పంపించడం మంచిదే!



ప్రీ- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ సరిగా మాటలు కూడా రాని వయసులో పిల్లల్ని బడికి పంపించడం మంచిదా, కాదా అనే సందేహం చాలామందికి ఉంటుంది. ఇంటిపట్టునే ఉంచుకుంటే ఏమవుతుందిలే అనుకుంటారు కొందరు అమ్మానాన్నలు. అయితే పిల్లల్ని ప్రీస్కూల్‌కి పంపించడం వల్ల మేలే జరుగుతుందని అంటున్నారు ది పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు. ఇందుకోసం ఆటపాటలతో కూడిన ప్రత్యేకమైన ప్రీ- స్కూల్ సిలబస్‌ని రూపొందించి, దాన్ని ఎంపిక చేసిన స్కూళ్లలో అమలయ్యేట్టు చూశారు. దీంట్లో తల్లిదండ్రులకూ భాగస్వామ్యం కల్పించారు. అక్కడ చదువు పూర్తిచేసుకున్న తర్వాత కూడా ఆ పిల్లల్ని గమనించడం మొదలుపెట్టారు. ఈ పిల్లలు తక్కిన వాళ్లతో పోలిస్తే చదవడం, రాయడంలోనే కాదు భావోద్వేగాలని నియంత్రించుకోవడంలో, ఒత్తిడి లేకుండా చదవడంలో, స్కూల్ ఛాలెంజెస్‌ని సమర్థంగా పూర్తిచేయడంలోనూ ముందున్నారట. ఈ చురుకుదనం హైస్కూల్ చదువూ ఆపైనా కొనసాగడం, సాధారణంగా టీనేజీ వయసులో ఎదురయ్యే ఇబ్బందుల్ని కూడా అవలీలగా అధిగమించడం కూడా శాస్త్రవేత్తలు గమనించారట.



మాలిక్యులర్ గ్లూని కనిపెట్టేశారు!

ఏ వస్తువు అయినా జీవితమంతా ఒకేలా పనిచేయదు... మధ్యలో చిన్నపాటి మరమ్మతులు రావొచ్చు. వాటిని గుర్తించి, ఆ మరమ్మతులేవో చేసేస్తే మరికొంతకాలం ఆ వస్తువు నిరాటంకంగా పనిచేస్తుంది. ఇదే సూత్రం మన శరీరంలోని కణాలకీ వర్తిస్తుంది. కానీ, ఇక్కడ మనం ఏం చేయకుండానే కణాలు వాటంతట అవే బాగవుతున్నాయి, మరి ఈ పని చేస్తున్నది ఎవరు... అనే అనుమానం ఎప్పుడైనా వచ్చిందా? ఆస్ట్రేలియాలోని మెక్వైర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ దిశగా ఆలోచించి, సమాధానం కనుగొన్నారు. డై సల్ఫైడ్ ఐసోమెరేస్(పీడీఐ) అనే ప్రొటీన్- మన డీఎన్ఏలో ఎక్కడ సమస్య వచ్చినా బాగు చేస్తుందట. కాలుష్యం, యూవీలైట్లూ, ఇతర కణాల తాకిడి కారణంగా ఛిద్రమయ్యే కణాలని ఈ పీడీఐ- జిగురులా అతికించేసి, పూర్వపు స్థితికి తీసుకొస్తుందట. మరోవైపు... బ్రెయిన్‌లోని కణాలు పెద్దమొత్తంలో నాశనం అవ్వడమే కానీ, తిరిగి ఉత్పత్తి కాకపోవడం వల్ల అల్జీమర్స్, పార్కిన్‌సన్స్‌లాంటి సమస్యలు పెరుగుతున్నాయి. గత ముప్ఫై ఏళ్లలో ఇలాంటి మోటార్ న్యూరాన్ డిసీజ్‌లు 250 శాతం పెరిగితే, రానున్న పదేళ్లలో ఇంతకు రెట్టింపు అవుతాయట. ఈ జబ్బులని అదుపులో ఉంచడానికి జీన్‌థెరపీలో భాగంగా ఈ సూపర్ గ్లూని వాడి, మతిమరపు సమస్యలకు అడ్డుకట్టవేయడంతోపాటు బయోలాజికల్ ఏజ్‌ని కూడా తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు.


ఫ్యాటీలివరా... ఇవి తినండి!

బీపీ, షుగర్ మాదిరిగానే ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తోంది. కాలేయంలో మోతాదుకు మించి కొవ్వుపేరుకుపోవడం వల్ల వచ్చే ఫ్యాటీలివర్‌ని అదుపులో ఉంచుకోకపోతే క్యాన్సర్‌కి కూడా దారితీయొచ్చట. కొన్ని రకాల ఆహారపదార్థాలని తీసుకోవడం వల్ల పరిస్థితి అంతవరకూ వెళ్లకుండా అడ్డుకోవచ్చు అంటున్నారు హార్వర్డ్ శాస్త్రవేత్తలు. డార్క్ చాక్లెట్, వాల్‌నట్స్, పెరుగు, దాల్చినచెక్క వంటివాటికి ఈ ఫ్యాటీలివర్‌ని అడ్డుకునే సామర్థ్యం ఉందట. అయితే, వీటిని విడివిడిగా కాకుండా ఒక కాంబినేషన్‌లో తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాలని పొందవచ్చట. ఇందులో మొదట చెప్పుకునే కాంబినేషన్ ఖర్జూరాలూ- వాల్‌నట్స్. రెండు ఖర్జూరాలూ, గుప్పెడు వాల్‌నట్స్‌ని వారంలో రెండుసార్లు తింటే కాలేయ వాపు, ఇన్‌ఫెక్షన్లని అడ్డుకోవచ్చుట. అలాగే డార్క్‌చాక్లెట్‌ని డ్రైనట్స్‌తో కలిపితింటే...వాటిలోని యాంటీఆక్సిడెంట్లు కాలేయ కణాలు దెబ్బతినకుండా కాపాడతాయట. అలాగే ఆపిల్- తేనె- దాల్చినచెక్కపొడి మేళవింపు కూడా ఫ్యాటీలివర్ నుంచి ఉపశమనం కలిగిస్తుందని అంటున్నారు శాస్త్రవేత్తలు. అదే సమయంలో తినకూడనివి కూడా కొన్ని ఉన్నాయట. ముఖ్యంగా చక్కెర, ప్రాసెస్ చేసిన పదార్థాలూ కాలేయానికి చేటు చేస్తాయని చెబుతున్నారు.



'పర్‌ప్లెక్సిటీ'... ఏఐ సెర్చ్ ఇంజిన్ల ప్రపంచంలో శరవేగంగా దూసుకొస్తోంది సంస్థ. లక్షన్నర కోట్ల విలువ చేసే ఈ కంపెనీని స్థాపించిన అరవింద్ శ్రీనివాస్... కలలు కనే దమ్మూ, దాన్ని నిజం చేసుకోవాలనే సంకల్ప బలం ఉండాలే కానీ 'గూగుల్', 'మైక్రోసాఫ్ట్'వంటి దిగ్గజాలకైనా ధైర్యంగా ఎదురెళ్లవచ్చు అని నిరూపించాడు. ఆ యువకుడిని ఇక్కడిదాకా నడిపించిన ఇంధనం ఏంటో తెలుసా... 'అసంతృప్తి'.

31 ఏళ్ల కుర్రాడు... లక్షన్నరకోట్ల సంస్థకి అధిపతి!



ప్రపంచం మొత్తం ఇప్పుడు 'ఏఐ'(కృత్రిమమేధ)గురించే ఆలోచిస్తోంది... ఆ దిశగానే అడుగులు వేస్తోంది. చదువులో చిన్నపాటి సందేహం వచ్చినా, ఉద్యోగంలో నైపుణ్యాల పరంగా ఒక అడుగు ముందుండాలన్నా, అంతెందుకు... వంట చేయడంలో సృజనాత్మకతని చూపించాలన్నా 'చాట్ జీపీటీ' ఉందిగా అనేస్తోంది నేటితరం. 'కానీ ఏఐ ఇచ్చే ఆ జవాబు ఎంతవరకూ కచ్చితం...' అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కుంటూ వెళ్లిన అరవింద్‌కి ఆ క్రమంలో మరికొన్ని ప్రశ్నలే ఎదురయ్యాయి కానీ, సంతృప్తికరమైన జవాబులు మాత్రం దొరకలేదు. అలాగని టెక్నాలజీని తిడుతూ కూర్చోలేదు... ఆ లోపాలనే అవకాశాలుగా మార్చుకుని, సరికొత్త ఏఐ సెర్చ్ ఇంజిన్‌ని ఆవిష్కరించాడు. దానిపేరే...'పర్‌ప్లెక్సిటీ'. ప్రస్తుతం ఈ సంస్థ విలువ లక్షన్నర కోట్లకు పైమాటే. చాట్ జీపీటీ, గూగుల్ జెమినీలతోపాటు ఎన్నో పెద్ద కంపెనీలకు చెమటలు పట్టిస్తున్న అరవింద్, ఏఐ సెర్చ్ ఇంజిన్లవైపు దృష్టి పెట్టడానికి కారణం ఉంది.

అమ్మ కల అది...

'మాది చెన్నైలోని మధ్య తరగతి కుటుంబం... నాన్న అకౌంటెంట్. చిన్నతనంలో అమ్మా, నేనూ సిటీ బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఐఐటీ- మద్రాస్ క్యాంపస్ కనిపించిన ప్రతిసారీ 'భవిష్యత్తులో నువ్విక్కడే చదువుకుంటావ్' అనేది అమ్మ. అక్కడ సీటు వస్తే బాగుండును అనికాకుండా, అక్కడ చదువుకుంటావ్ అని కచ్చితంగా అమ్మ అన్న మాటలు నా మీద ఎంత ప్రభావం చూపించాయంటే ఐఐటీలో సీటు రావడం తెలికేమో అనుకునేలా చేశాయి. అనుకున్నట్టుగానే అక్కడ సీటు వచ్చింది కానీ, అది నాకిష్టమైన కంప్యూటర్ సైన్స్‌లో కాకుండా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో వచ్చింది. కంప్యూటర్ సైన్స్‌లో నా స్నేహితులందరికీ సీటు దొరికి, నాకు మాత్రమే రాకపోవడంతో చాలా నిరాశపడ్డా. ఏడాది తర్వాత నచ్చిన విభాగంలోకి మారే అవకాశం ఉన్నా, ఆ ప్రయత్నంలోనూ... 0.01 స్కోర్ తేడాతో చేజార్చుకున్నాను. దాంతో రెండేళ్లపాటు డిప్రెషన్‌లో ఉండిపోయా. అయినా, నా ప్రయత్నాన్ని విడిచిపెట్టలేదు. కాలేజీ అయ్యాక రాత్రుళ్లు మెషిన్ లెర్నింగ్ కోర్సుల్లో చేరి నైపుణ్యాలు పెంచుకునేవాడిని. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో స్నేహం చేసేవాడిని. మూడో ఏడాది కంప్యూటర్ సైన్స్ విభాగం వాళ్లు మాకో క్లాసు తీసుకునేవారు. ఆ క్లాసుకొచ్చే ప్రొఫెసర్‌కి నా పట్టుదల నచ్చింది. ఆయన సూచనలతోనే ఎంటెక్ అయ్యాక, నాకిష్టమైన కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసే దారి దొరికింది. అలా క్యాలిఫోర్నియా యూనివర్సిటీలో మెషిన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీ చేశా. ఓపెన్ ఏఐ కో-ఫౌండర్‌గా ఉన్న జాన్ షుల్‌మాన్, యూనివర్సిటీలో మా సీనియర్. మెషిన్ లెర్నింగ్‌లో నాకున్న ఆసక్తిని గమనించిన ఆయన కృత్రిమమేధపైన పనిచేస్తున్న 'ఓపెన్ ఏఐ', 'డీప్ మైండ్'ల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు. అప్పుడే- ఏఐ భవిష్యత్తుని శాసిస్తుందని అర్థమైంది. నేనుంటున్న అపార్ట్‌మెంట్‌లో ఎలుకల బాధ ఎక్కువగా ఉండేది. దాంతో చాలాసార్లు 'డీప్‌మైండ్' ఆఫీసులోనే పడుకునేవాడిని. అప్పుడే అక్కడి లైబ్రరీలో గూగుల్ స్థాపకులు లారీపేజ్, సెర్గెబ్రిన్‌లు రాసిన... 'ఇన్ ది ప్లెక్స్' పుస్తకాన్ని చదివాను. అప్పట్నుంచీ నా జీవితానికి బైబిల్, భగవద్గీత ఆ పుస్తకమే. ఇంతకీ అందులో ఏముందో తెలుసా... గూగుల్‌ని అంత ఎత్తుకు తీర్చిదిద్దిన విధానం. ఏఐలో నేను ఏదో సాధించాలన్న ఆలోచనకి ఆ పుస్తకమే స్ఫూర్తి' అంటాడు అరవింద్ శ్రీనివాస్.



వేగంలో ముందుంటూ...

పీహెచ్‌డీ విద్యార్థులకి పరిశోధన కోసం సమాచారం కావాలి. నెట్‌లో సమాచారం దొరికినా అది కచ్చితమైనదేనా, సోర్స్ ఏంటి అనేది తెలిసేది కాదు. అరవింద్ కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నాడు. పైగా ఏఐ సెర్చ్ ఇంజిన్లు ఒక నిర్ణీత సమయం వరకూ ఉన్న సమాచారాన్ని మాత్రమే అందిస్తాయి. 'ఇప్పుడు బంగారం ధర ఎంత?' లేదా 'కరెంట్ అఫైర్స్ గురించి చెప్పు?' అంటే అవి చెప్పలేకపోయేవి. ఆ సమస్యలని పరిష్కరిస్తూ, ప్రస్తుతం ఉన్న ఏఐ చాట్‌బాట్‌లనే వాడుకుని 2022లో పర్‌ప్లెక్సిటీ ఆలోచనకు ప్రాణం పోశాడు అరవింద్. ఈ ఆలోచన నచ్చడంతో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్‌బెజోస్, యూట్యూబ్ మాజీ సీఈవో సుశాన్ వంటివారితోపాటు, ప్రఖ్యాత అమెరికన్ టెక్ కంపెనీ ఎన్‌విడియా కూడా పెట్టుబడులు అందించింది. పర్‌ప్లెక్సిటీ- మనం ఒక ప్రశ్న వేస్తే, ఇతర సెర్చ్ ఇంజిన్ల మాదిరిగా కొన్ని లింకులని మన ముందు ఉంచి, 'మీరే వెతుక్కోండి' అనదు, సమాధానం చెబుతుంది. ఆ జవాబు ఎక్కడ నుంచి దొరికిందో ఆ సోర్స్ గురించి కూడా చెబుతుంది. రియల్ టైం సమాచారాన్ని అందిస్తూ, అందరినీ ఆకట్టుకుంటోంది కాబట్టే ప్రారంభించిన మూడేళ్లలోనే రెండుకోట్లమంది యూజర్లనీ, కోట్లకొద్దీ పెట్టుబడులనీ అందుకుని యూనికార్న్‌గా మారింది. అరవింద్‌ని '100 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ'లో ఒకరిగా టైమ్ ప్రకటించింది. ఇంతాచేస్తే అతని వయసెంతో తెలుసా... జస్ట్ 31! ★

షాపింగ్



వెలిగే కుండీలు

ఇంటిని ప్రేమించేవాళ్లు ఆ ఇంటిని మరింత అందంగా ఎలా తీర్చిదిద్దాలా అని నిరంతరం తపన పడుతూ ఉంటారు. ఆ జాబితాలో మీరూ ఉంటే, ఈ గ్లో-పాట్స్ గురించి తెలుసుకోవాల్సిందే. ఎందుకంటే ఇవి చూడ్డానికి సాధారణ పూల కుండీల్లానే అనిపించినా, రాత్రుళ్లు ధగధగా మెరిసిపోతాయి. ఫొటోలుమినిసెంట్ పాలీరెజిన్ అనే ప్రత్యేకమైన మెటీరియల్‌తో తయారైన ఈ కుండీలకు ఏ ఛార్జింగ్ అవసరం లేదు. ఇంటా, బయటా ఎక్కడైనా అలంకరించుకోవచ్చు.

మ్యాజిక్ గోడ



అప్పుడప్పుడే నడక నేర్చుకుంటున్న గడుగ్గాయిల చేతికి పెన్నో, పెన్సిలో, సుద్దముక్కో దొరికిందనుకోండి. ఇక అంతే, ఇంటి గోడలన్నీ గీతలతో నిండిపోవాల్సిందే. అలాగని వారిస్తే, ఇక చిన్నారుల్లో సృజనాత్మకత పెరిగేదెలా? ఈ సమస్యను పరిష్కరించడానికి వచ్చినవే మ్యాజిక్ వాల్స్. గోడకి అతికించడానికి వీలుగా ఉండీ, పిల్లలు వీటిపైన రాసుకోవడానికీ, చెరుపుకోవడానికీ- మ్యాగ్నటిక్ నంబర్లలాంటివి అతికించుకోవడానికీ ప్రత్యేకంగా తయారుచేశారు. పిల్లలకు తగిన ఎత్తులో వీటిని అతికిస్తే చాలు, వాళ్లు ఎంత బిజీ అయిపోతారో మీరే చూడండి.





బటన్లకి కవర్లు



ఒక్కోసారి డ్రెస్ ఎంత సింపుల్‌గా అయినా ఉండొచ్చు. కానీ, ఆ డ్రెస్‌కి ఉండే ఒకే ఒక్క బటన్‌తో దాని అందం రెట్టింపవుతుంది. కానీ అన్ని డ్రెస్‌లకీ మనం కోరుకున్నంత అందంగా బటన్స్ రావాలని లేదు కదా... కొన్ని మరీ సింపుల్‌గా ఉండి, డ్రెస్ తేలిపోతుంది. డ్రెస్ బాగుంది... బటన్స్ కూడా బాగుంటే డ్రెస్ అదిరిపోతుంది అనుకునే వారికోసమే ఈ బటన్ కవర్స్. ఏ సాధారణ బటన్‌కైనా సరే వీటిని తేలిగ్గా తొడిగేసుకోవచ్చు, ఆపైన అందంగా మెరిసి పోవచ్చు.



జేబులో రెయిన్‌కోట్...

అసలే వానాకాలం... ఎప్పుడైనా వాన రావొచ్చు. అలాగని, ప్రతిరోజూ ప్రతిచోటకీ రెయిన్‌కోట్ పట్టుకుని తిరగలేం. ప్రయాణాలప్పుడూ ఇదే చింత....బ్యాగులో రెయిన్‌కోట్‌ని పెడితే స్థలం ఆక్రమిస్తుంది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ వచ్చినవే జేబులో ఇమిడే యూజ్ అండ్ త్రో రెయిన్ కార్డులు. వాలెట్‌లో పెట్టుకోవడానికి వీలుగా ఉండే, ఈ రెయిన్ కార్డులు చాలా తేలిగ్గా ఉంటాయి... తక్కువ ధరలో దొరుకుతాయి. అత్యవసర సమయంలో వాడి పారేయొచ్చు.



ఏడు రంగుల్లో...

తెల్లారి అమ్మల ముందు ఉండే అతిపెద్ద టాస్క్ ఏంటో తెలుసా... పిల్లలతో బ్రష్ చేయించడం. బ్రష్ చేయనని మారాం చేసే పిల్లలని ఆకట్టుకునేందుకు రెయిన్‌బో క్రిస్టల్స్ టూత్‌పేస్ట్ వచ్చేసింది. ఇందులో నోటి తాజాదనాన్ని పెంచేందుకు వాడే క్రిస్టల్స్‌ని హార్ట్ షేపులో తయారుచేశారు. కనువిందు చేసే ఇంద్రధనుస్సు రంగుల్లో ఉన్న చిట్టిచిట్టి హార్ట్‌లు పిల్లల్లో ఉత్సాహాన్ని పెంచడంతోపాటు, నోటిలోని క్యావిటీలకూ అడ్డుకట్ట వేస్తాయట.



బంగారు ముద్రలు

పసిపిల్లల చిట్టిచిట్టి పాదాలూ, చిన్నిచిన్ని చేతులని ఎంతసేపు చూసినా తనివితీరదు. అందుకే పాపాయిల పాదాలూ, చేతి ముద్రలని దాచిపెట్టుకునేందుకు క్లేతో చేసే ఇంప్రింట్స్ పద్ధతులున్నా అవి చాలా సమయం తీసుకుంటాయి. అలాకాకుండా ఈ బేబీ ఇంప్రింట్ ఫాయిల్ కిట్స్‌ని వాడి పిల్లల చేతులూ, పాద ముద్రలనీ క్షణాల్లో అందమైన ఫొటో ఫ్రేములుగా మార్చేయొచ్చు. గోల్డ్, సిల్వర్, రోజ్‌గోల్డ్ ఫాయిల్స్‌లోంచి మనకు నచ్చిన రంగుని ఎంచుకుని, దాన్ని ఫొటోఫ్రేమ్‌పైన ఉంచి పాపాయి పాదాలనీ, చేతులనీ కాస్త గట్టిగా అద్దితే చాలు. ఆ ముద్రలు ఫొటోఫ్రేముల్లో అచ్చులా పడతాయి. ఆ తర్వాత నెమ్మదిగా మిగతా ఫాయిల్‌ని తొలగించడమే!







పొట్టవిప్పితే... మైక్రోప్లాస్టిక్!



నీళ్లతోపాటూ తాగుతున్నాం. గాలితోపాటూ పీలుస్తున్నాం. అన్నంతోపాటూ తింటున్నాం. ఇప్పటికే రకరకాల రూపాల్లో ప్రకృతిని ఆక్రమించిన మైక్రోప్లాస్టిక్... మన లోలోపలికి కూడా ప్రవేశిస్తోంది. ఊపిరితిత్తుల్ని చిత్తు చేస్తోంది. మెదడుకు దడ పుట్టిస్తోంది. రోగ నిరోధకతకు చిల్లులు పెడుతోంది. ఈ సంక్షోభానికి కారణం మనమే. పరిష్కారం కనిపెట్టాల్సిన బాధ్యతా మనదే.

ఇప్పటికే మనం, గుట్టల్లా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల్ని చూసి భయపడిపోతున్నాం. రేపటి ప్రభావాల్ని తలుచుకుని బిక్కచచ్చిపోతున్నాం. ఇంతలోనే మరో విపత్తు... 'మైక్రోప్లాస్టిక్' వైపు నుంచీ! ఇది ప్లాస్టిక్‌కు శిథిల రూపం. పరిమాణం చిన్నదే అయినా, పంచభూతాల్నీ ప్రభావితం చేస్తోంది. ఈ సంక్షోభం తీవ్రతను తెలుసుకోవాలంటే సమస్య మూలాల్లోకి వెళ్లాలి. ఏడెనిమిది దశాబ్దాల క్రితం ప్లాస్టిక్ మన దేశంలో అడుగుపెట్టింది. గ్రీకుపదం 'ప్లాస్టికో' (మలుచుకోడానికి వీలైంది) నుంచి 'ప్లాస్టిక్' అనే మాట పుట్టిందని అంటారు. పెట్రోలియం వ్యర్థాలతో ముడి ప్లాస్టిక్ తయారు అవుతుంది. ఇదో సుతిమెత్తని పదార్థం. ఎలా అయినా మార్చుకోవచ్చు. ఎన్నిసార్లయినా వాడుకోవచ్చు. ధర కూడా తక్కువే. దీనివల్ల, పారిశ్రామిక రంగంలో ప్యాకేజింగ్ సమస్యలు తీరిపోయాయి. సామాన్యులకేమో సరుకులకో, కూరగాయలకో బయల్దేరుతున్నప్పుడు గుడ్డ సంచులు తీసుకెళ్లాల్సిన కష్టం తప్పింది. కానీ, రాబోయే విపత్తును మాత్రం ఎవరూ ఊహించలేకపోయారు. మొదట్లో అంతా బాగానే ఉండేది. ఓ దశ తర్వాత పరిస్థితి మారింది. వాడకం విపరీతంగా పెరిగిపోయింది. కుర్చీలు, టిఫిన్ బాక్సులు, మసాలా డబ్బాలు, పళ్లాలు, లోటాలు, మగ్గులు, బకెట్లు... ఇలా అనేక రూపాల్లో ప్లాస్టిక్ మార్కెట్లోకి ప్రవేశించింది. క్రమంగా అందరి జీవితాల్నీ ఆక్రమించేసింది. ఇందులోనూ రకరకాలు.

కొన్ని ప్లాస్టిక్ వస్తువుల్ని ఒకసారే వాడి పడేస్తాం. ఇంకొన్ని మాత్రం ఏడాది తర్వాతో, రెండేళ్ల తర్వాతో మూలన పడతాయి. అలా దేశవ్యాప్తంగా ఏటా కోటి టన్నుల వ్యర్థాలు పోగవుతున్నట్టు అంచనా. వాటిలో పన్నెండు శాతం వరకూ రీసైకిల్ చేస్తున్నారు. పద్దెనిమిది శాతం ఏదో ఓ సందర్భంలో బూడిదపాలు అవుతోంది. మిగతా ఎనభైశాతం సూర్యకాంతికి కరిగిపోయీ, పెనుగాలికి చిరిగిపోయీ, వాహనాలకింద నలిగిపోయీ, మట్టిలో కూరుకుపోయీ, డ్రైనేజీలో చిక్కుకుపోయీ... ముక్కలు ముక్కలై మైక్రోప్లాస్టిక్‌గా మారుతోంది. ఐదు మిల్లీమీటర్లలోపు ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఈ పరిధిలోకే వస్తాయి. అంతకంటే చిన్నవాటిని 'నానోప్లాస్టిక్'గా వ్యవహరిస్తారు. ఈ రెండింటిలోని బిస్ఫినాల్-ఎ, థాలేట్స్, పాలీబ్రోమినేటెడ్ డైఫినైల్ ఈథర్స్... మొదలైన హానికర రసాయనాలు మనిషి మీద విషం చిమ్ముతున్నాయి.

అన్నంలో అన్నమై...

గాలి, నీరు, నేల... సృష్టిలో మైక్రోప్లాస్టిక్ జాడలేని చోటంటూ కనిపించదు. చివరికి, వంటింట్లోనూ భోజనాలతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలూ తయారవుతున్నాయి. అందులోనూ, ఇటీవల మైక్రోవేవ్ ఒవెన్ల వాడకం పెరిగిపోయింది. ఒవెన్‌లో పెట్టే ప్లాస్టిక్ పాత్రలు ఆ వేడికి కాస్తంత కరిగిపోయి, హానికర శకలాలు ఆహారంలో కలిసిపోతున్నాయి. పొట్టలోకి చేరిపోతున్నాయి. కొంతమంది, పసిపిల్లలకు పట్టించే పాలను కూడా ప్లాస్టిక్ బాటిళ్లతోసహా ఒవెన్‌లో పెడుతున్నారు. అలా, తమకు తెలియకుండానే పసిబిడ్డలకు గుక్కెడు ప్లాస్టిక్‌నూ పట్టిస్తున్నారు. దీనివల్ల చిన్నారుల ఎదుగుదల మందగించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కటింగ్ బోర్డు మీద కూరగాయల్ని తరిగినప్పుడు... కత్తి పదును వల్ల పుట్టుకొచ్చిన మైక్రోప్లాస్టిక్ కణాలు కుక్కర్‌లో ఉడికిపోయి, భోజనంగా పళ్లెంలో ప్రత్యక్షం అవుతున్నాయి. దర్జాగా జీర్ణ వ్యవస్థను చేరుతున్నాయి. ఈ పరిస్థితి దీర్ఘకాలంలో పెద్దపేగు క్యాన్సర్‌కు దారితీస్తుందని ప్రాథమిక అధ్యయనాలు చెబుతున్నాయి. మనిషినే లెక్కచేయని మైక్రోప్లాస్టిక్... మూగజీవాల్ని మాత్రం వదిలిపెడుతుందా? నీళ్లలో కలిసిపోయో దాణాలో దాక్కునో గొర్రెలూ, మేకలూ, కోళ్ల శరీరాల్లోకి చొరబడుతోంది. చేపల్లాంటి సముద్ర జీవుల్ని కోస్తే... మాంసం కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా కనిపిస్తున్న ఉదంతాలు అనేకం. వాటిని లొట్టలేస్తూ తిన్నప్పుడు... ఆ అవశేషాలు ఒంట్లోకి చేరి, కణకణానికీ విస్తరిస్తున్నాయి. అందుకే, ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారాన్ని మితంగా తీసుకోవడమే మేలని సలహా ఇస్తారు వైద్యులు. అంతర్జాతీయ పరిశోధకులు కోడిగుడ్లలోనూ మైక్రోప్లాస్టిక్ ఆనవాళ్లను కనిపెట్టారు. పచ్చని కూరగాయల్నీ స్వచ్ఛంగా ఉండనీయడం లేదా 'సూక్ష్మ' భూతం. పొలంలోని పంట మొక్కలు నేలలోంచి నీటిని పీల్చుకున్నప్పుడు, మైక్రోప్లాస్టిక్ కూడా కాండంలోకి వెళ్లిపోయి... కూరగాయల్నీ, ఆకుకూరల్నీ చేరుతున్నట్టు తాజాగా వెల్లడైంది. కొన్ని రసాయన ఎరువుల గుళికలకు ప్లాస్టిక్ కోటింగ్

ఇస్తుంటారు తయారీదారులు. ఆహారంలో మైక్రోప్లాస్టిక్ చొరబాటుకు ఇదీ ఓ మార్గమే. ఇటలీలో జరిగిన అధ్యయనం... పళ్లలో- యాపిల్‌లో, కూరగాయల్లో-క్యారెట్‌లో మైక్రోప్లాస్టిక్ మోతాదు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించింది. మనం ఎంతోకొంత స్వచ్ఛమని భావించే తేనెలోనూ మైక్రోప్లాస్టిక్ భాగమైపోయింది. కొన్ని కంపెనీలు, మెత్తదనం కోసం చూయింగ్ గమ్‌ల తయారీలోనూ మైక్రోప్లాస్టిక్‌ను జొప్పిస్తున్నాయి. మార్కెట్‌లో దొరికే ప్రతి కిలో అయోడైజ్డ్ ఉప్పులో 90 వరకూ, ప్రతి కిలో పంచదారలో 69 వరకూ అతి చిన్న ప్లాస్టిక్ ముక్కలు ఉన్నట్టు గుర్తించింది 'టాక్సిక్ లింక్' అనే సంస్థ. భారతీయులు రోజుకు సగటున పదకొండు గ్రాముల ఉప్పునూ, పది చెంచాల చక్కెరనూ వినియోగిస్తారని ఓ అంచనా. అలా, తమకు తెలియకుండానే మైక్రోప్లాస్టిక్‌నూ ఆరగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి. ఓ అధ్యయనం ప్రకారం... ప్రతి వ్యక్తీ వారానికి ఐదు గ్రాముల ప్లాస్టిక్‌ను ఆహారంతోపాటూ తీసుకుంటున్నాడు. అంటే, నెలకు నాలుగు క్రెడిట్‌కార్డులను అలవోకగా మింగేస్తున్నాడన్నమాట.

గాల్లో తేలిపోయి...

శ్వాస రూపంలో మనలోకి ప్రవేశిస్తున్న ప్లాస్టిక్ మీద శాస్త్రవేత్తలు ఇప్పటివరకూ పెద్దగా ధ్యాస పెట్టలేదు. ఆ వ్యర్థాలు బియ్యపు గింజ కంటే కూడా చిన్నగా ఉంటాయి. దీంతో గాలిలో ధూళిలో సులభంగా కలిసిపోతాయి. ప్రతి క్యూబిక్ మీటరు ప్రాణవాయువులో దాదాపు వెయ్యి ప్లాస్టిక్ పదార్థాలు ఉన్నట్టు లెక్కతేల్చారు పరిశోధకులు. మనం శ్వాస పీల్చుకున్నప్పుడు, గాలితోపాటు అవి కూడా ఊపిరితిత్తుల్లోకి చొరబడిపోయి... దీర్ఘకాలంలో శ్వాసకోశ సమస్యలకు కారణం అవుతున్నాయి. అక్కడితో ఆగకుండా, ఒంట్లోని రక్తాన్ని కూడా కలుషితం చేస్తున్నాయి. ఎర్రరక్త కణాలకు అతుక్కుపోయి... ఆక్సిజన్ సరఫరాలో అవరోధాలు సృష్టిస్తున్నాయి. మూత్రనాళంలో చిక్కుకుపోయి, వ్యర్థాల విసర్జనకు అడ్డంకిగా మారుతున్నాయి. జన్యు నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి శారీరక, మానసిక వైకల్యాలకు కారణం అవుతున్నాయి. నవజాత శిశువు తొలి మలవిసర్జనలోనూ ఆ ఆనవాళ్లను కనిపెట్టారు. పునరుత్పత్తి ప్రక్రియకు కూడా మైక్రోప్లాస్టిక్ సవాలు విసురుతోంది. పురుషుల వీర్యంలో సైతం ఆ వ్యర్థాల్ని గమనించారు. ఒంట్లోని మైక్రోప్లాస్టిక్ ప్రభావంతో... హార్మోన్ వ్యవస్థ అతలాకుతలమైపోయి, మహిళల రుతుక్రమం అదుపు తప్పుతోంది. పచ్చి బాలింతల చనుబాలలోనూ ప్లాస్టిక్ పరమాణువులను గుర్తించారు. గర్భధారణ సమయంలో తల్లి శరీరంలో 'జరాయువు' అనే తాత్కాలిక వ్యవస్థ జీవం పోసుకుంటుంది. అదే తల్లీబిడ్డల మధ్య వారధిగా నిలుస్తుంది. మైక్రోప్లాస్టిక్ ఆ భాగాన్నీ వదలడం లేదని తాజా అధ్యయనాలు తేల్చి చెప్పాయి. దీనివల్ల బిడ్డకు ప్రాణవాయువు కొరత ఏర్పడుతుంది. కీలక పోషకాలు అందవు. అన్ని సవాళ్లనూ అధిగమించి, ఎలాగోలా భూమి మీద పడినా... నాడీ సంబంధమైన రుగ్మతలు జీవితాంతం ఇబ్బంది పెడతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము అధ్యయనం చేసిన ప్రతి మెదడులోనూ ఐదు సీసా మూతలతో సమానమైన ప్లాస్టిక్ అణువుల్ని గమనించామని ప్రకటించారు న్యూ మెక్సికో ల్యాబ్ పరిశోధకులు. ఆ ప్రభావం అల్జీమర్స్ లాంటి సమస్యలకు దారితీసే ఆస్కారం లేకపోలేదు. మిగిలినవారితో పోలిస్తే... మైక్రోప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉన్న పరిశ్రమలూ, జలాశయాలూ, డంపింగ్ యార్డులకు చేరువలో జీవించేవారికి టైప్-2 మధుమేహం 18 శాతం మేర, పక్షవాతం 9 శాతం మేర, గుండె సమస్యలు 7 శాతం మేర ముందుగానే చుట్టుముట్టడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మైక్రోప్లాస్టిక్ మనిషిలోని ఏ భాగాన్నీ వదిలిపెట్టడం లేదు. అనగనగా కథలో... గాజు పాత్రలోంచి బయటికొచ్చిన భూతం,

ప్లాస్టిక్‌కు దూరంగా...

జీవనశైలి మార్పులతో, కొద్దిపాటి జాగ్రత్తలతో ఇంటా బయటా మైక్రోప్లాస్టిక్ ప్రభావాన్ని నియంత్రించడం సాధ్యమే.

★ వీలైనంత వరకూ కాటన్ దుస్తులనే ధరించాలి.

★ టాయిలెట్లు, టైల్స్ శుభ్రం చేయడానికి మైక్రోప్లాస్టిక్‌తో తయారైన రసాయనాలకు బదులుగా... వెనిగర్, నిమ్మరసం కలిపిన నీటిని వాడినా మంచి ఫలితమే ఉంటుంది.

★ ప్యాకేజ్డ్ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను సాధ్యమైనంత దూరం ఉంచాలి.

★ ప్లాస్టిక్ డబ్బాలకు ప్రత్యామ్నాయం వెతుక్కోవాలని ఫుడ్ డెలివరీ సంస్థలకు ఫీడ్‌బ్యాక్ రూపంలో సూచించాలి.

★ మైక్రోవేవ్ ఒవెన్లలో ఆహారాన్ని వేడి చేయడానికి గాజు లేదా పింగాణీ పాత్రల్నే ఎంచుకోవాలి.

★ ఇంటికి అవసరమైన కూరగాయల్ని పెరట్లోనో, కుండీల్లోనో పండించుకోవడం ఉత్తమం.

★ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిత్య జీవితంలోంచి పూర్తిగా బహిష్కరించాలి.

★ సింథటిక్ కార్పెట్లూ, పరుపులూ వాడకపోవడం మంచిది.

★ దశలవారీగా అయినా... వంటింటి అవసరాలకు గ్లాసు, పింగాణీ, మట్టి, స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రల్ని సమకూర్చుకోవాలి.

★ ప్లాస్టిక్ కుర్చీలూ, టేబుళ్ల స్థానంలో కలప, వెదురు ఫర్నిచర్‌ను ఉపయోగించడం ఉత్తమం.

★ పిల్లలకు ప్లాస్టిక్ ఆట వస్తువుల్ని కొనివ్వకూడదు. బహుమతిగానూ ఇవ్వకూడదు.

★ విందులూ వినోదాల్లో ప్లాస్టిక్ పళ్లాలూ, చెంచాలూ, కప్పులూ ,గ్లాసులూ దూరం ఉంచాలి.


★ వాషింగ్ మెషీన్‌లో ఒకట్రెండు బట్టలు వేయకుండా, పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవాలి. దీనివల్ల మైక్రోప్లాస్టిక్ విడుదల కొంతమేర తగ్గుతుందని అంచనా.

★ ప్లాస్టిక్ మైక్రోబీడ్స్ ఉన్న సౌందర్య సాధనాల్ని దూరం పెట్టాలి. ఆయా ఉత్పత్తుల అట్టమీద ఆ ప్రస్తావన ఉంటుంది.



ప్రకృతికైనా పరీక్షే!

మైక్రోప్లాస్టిక్ ప్రకృతిని సైతం ప్రశాంతంగా ఉండనీయడం లేదు. ఇప్పటికే సముద్రాలన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. క్రమంగా ఆ చెత్తంతా శిథిలమైపోయి మైక్రోప్లాస్టిక్‌గా రూపాంతరం చెందుతోంది. అది కాస్తా సముద్రజీవుల పొట్టల్లో చేరుకుని, ఆయా ప్రాణుల్ని రుగ్మతలపాలు చేస్తోంది. దీంతో జీవావరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోంది. అనేక సముద్ర జీవులు ఆహారంగా తీసుకునే ఫైటోప్లాంక్టన్ అనే మెరైన్ ఆల్గేను కూడా మైక్రోప్లాస్టిక్ నాశనం చేస్తోంది. దీంతో సముద్ర ప్రాణుల ఆహారచక్రం మధ్యంతరంగా ఆగిపోతోంది. అంతేకాదు, గాల్లోని ప్లాస్టిక్ శకలాలు ఆకాశం వైపుగానూ దూసుకెళ్తున్నాయి. వేలమైళ్ల దూరం ప్రయాణించి... మేఘాల పనితీరును ప్రభావితం చేస్తున్నాయి. అక్కడక్కడా 'ప్లాస్టిక్ వర్షం' కురిపిస్తున్నాయి. ఆ వానలు నివాస ప్రాంతాల్నే కాదు... పచ్చని అడవులనూ కలుషితం చేస్తున్నాయి. ప్లాస్టిక్ పదార్థాలు గొంతులో చిక్కుకుపోవడం వల్ల అనేక పక్షుల స్వరాల్లో తేడా వస్తోంది. దీంతో, పక్షిజాతుల కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసం అవుతోంది. కొన్నిసార్లు దారితప్పి దూరప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి.



బిరడా తీసినవాడి మెడకే చుట్టుకున్నట్టు... ప్లాస్టిక్ కూడా తనకు జీవం పోసిన మనిషి ప్రాణాలనే తోడేస్తోంది. మైక్రోప్లాస్టిక్ చెడు ప్రభావాల మీద జాతీయ స్థాయిలో మరిన్ని అధ్యయనాలు జరగాల్సి ఉంది.

'మార్కెట్' మహమ్మారి!

మార్కెటింగ్ మాయాజాలం కావచ్చు. ఖర్చులు తగ్గించుకునే కక్కుర్తీ కావచ్చు. ఏదైతేనేం ప్యాకేజింగ్ కార్ఖానాలూ, వస్త్ర పరిశ్రమలూ, పెయింటింగ్స్ తయారీ సంస్థలూ... సగానికి సగం మైక్రోప్లాస్టిక్ వ్యర్థాలకు కారణం అవుతున్నాయి. మనం సరుకులు తెచ్చుకునే ప్లాస్టిక్ కవర్లూ, ఫుడ్ డెలివరీ సంస్థలు బిర్యానీలూ ఫ్రైడ్‌రైస్‌లూ అందించే డబ్బాలూ, క్యాంటీన్‌లోనో టీకొట్టులోనో మనం తాగిపడేసే చాయ్ కప్పులూ, నీళ్ల గ్లాసులూ మరుక్షణమే చెత్తబుట్ట పాలు అవుతున్నాయి. క్రమంగా మైక్రోప్లాస్టిక్‌గా మారిపోతున్నాయి. మనం ఇష్టంగా ధరించే సింథటిక్ వస్త్రాల పోగులు సైతం... ఉతికినప్పుడో, వ్యర్థాల్లో పడేసినప్పుడో 'మైక్రో' అవతారమెత్తి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. కొన్ని రకాల కాస్మటిక్స్ తయారీలో... కొత్త మెరుపును జోడించడానికీ, ఇంకాస్త మెత్తదనాన్ని తీసుకురావడానికీ మోతాదుకు మించి మైక్రోప్లాస్టిక్‌ను వాడుతున్నట్టు తెలుస్తోంది. కొన్ని బ్రాండ్లు అయితే, తమ ఉత్పత్తిలో 90 శాతం వరకూ మైక్రోప్లాస్టిక్‌తోనే నింపేస్తున్నాయి. టూత్‌బ్రష్‌ల తయారీలోనూ చాలావరకూ ప్లాస్టిక్ పదార్థాల్నే వాడతారు. బ్రష్ పాతబడే కొద్దీ... అందులోని ముళ్లు వదులైపోతాయి. పళ్లు తోముకుంటున్నప్పుడు, ఆ రాపిడికి ఊడిపోయి పొట్టలోకి వెళ్లిపోతున్నాయి. అందుకే, ఎంత నాణ్యమైన బ్రష్‌ను అయినా సరే, ఒకటిరెండు నెలలకు మించి వాడకూడదని సలహా ఇస్తారు డెంటిస్టులు. ప్లాస్టిక్ తయారీలో పదివేల పైచిలుకు రసాయనాల్ని ఉపయోగిస్తారు. అందులో చాలావరకూ ప్రమాదకరమే. ఆ ప్రకారంగా, ప్రతి ప్లాస్టిక్ శకలమూ పదివేల పడగల విషనాగుతో సమానం. ఏ కోరతో అయినా అది కాటేయవచ్చు. ఇప్పటికే అమెరికాలాంటి దేశాలు కాస్మటిక్స్ తయారీలో కొన్నిరకాల ప్లాస్టిక్ గుళికల్ని నిషేధించాయి. ఇంకో పదేళ్ల నాటికైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దేశం నుంచి తరిమేయాలన్నది అమెరికా ప్రయత్నం. మనకైతే వందేళ్ల సమయమైనా సరిపోకపోవచ్చు. అంతలా వేళ్లూనుకుపోయిందా మహమ్మారి. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం... ప్లాస్టిక్ కాలుష్యంలో మనం ఐదో స్థానంలో ఉన్నాం. ప్రపంచంలోని చెత్తలో ఇరవైశాతం వరకూ భారత్ సృష్టిస్తున్నదే.

పరిష్కారం?

సమస్య తీవ్రత తెలిసిపోయింది. సంక్షోభానికి మూలాలూ అర్థమైపోయాయి. మైక్రోప్లాస్టిక్ పనిపట్టడమే మిగిలిపోయింది. నిజమే, అదంత సులభం కాదు. అలా అని అసాధ్యమూ కాదు. గతంతో పోలిస్తే భారత్‌లో వ్యక్తిగత రవాణా వాహనాల వినియోగం పెరిగిపోయింది. ప్రతి ఇంట్లోనూ సగటున రెండు వాహనాలైనా ఉంటున్నాయి. మనం బండి బయటికి తీసిన ప్రతిసారీ... టైర్ల రాపిడి వల్ల గుప్పెడు మైక్రోప్లాస్టిక్ పర్యావరణంలో కలిసిపోతుంది. ఇతర దేశాలకు కూడా ఇలాంటి చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా యూకేలో ఓ స్టార్టప్ 'టైర్ కలెక్టివ్' అనే ఉపకరణాన్ని రూపొందించింది. ఇది టైర్లలోంచి వెలువడే మైక్రోప్లాస్టిక్ ప్రకృతిలో కలిసిపోకుండా... ఓ డబ్బాలో పోగేస్తుంది. తర్వాత ఆ వ్యర్థాల్ని పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఆస్ట్రేలియాలోని ఆర్ఎమ్ఐటీ విశ్వవిద్యాలయ నిపుణులు కనిపెట్టిన మ్యాగ్నెటిక్ పొడరును నీళ్లలో చల్లితే కనుక... అది మైక్రోప్లాస్టిక్‌ను అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. జలవనరుల్ని చకచకా శుద్ధి చేస్తుంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పరిశోధకులు కూడా దాదాపుగా ఇలాంటి హైడ్రోజెల్‌నే కనిపెట్టారు. అమెరికన్ శాస్త్రవేత్తలు ఓ అడుగు ముందుకేసి, సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్‌ను ఏరేయడానికి రోబోలను రంగంలోకి దించారు. కాకపోతే, ఈ ప్రయత్నాలన్నీ ఆరంభ దశలోనే ఉన్నాయి. సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. అప్పటివరకూ, మనం చేయగలిగింది ఒకటే... చిత్తశుద్ధితో '3-ఆర్' సూత్రాన్ని పాటించడం.

ఆర్... రెడ్యూస్.
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవడం.
ఆర్... రీయూజ్.
అవకాశం ఉన్న ప్రతిచోటా పునర్వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వడం.
ఆర్... రీసైకిల్.
గుట్టలా పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను సురక్షితమైన పద్ధతుల్లో రీసైకిల్ చేసుకోవడం.

★ ★ ★

పురాణ కథలో అగస్త్యుడు 'వాతాపి జీర్ణం' అనుకోగానే పొట్టలోని వాతాపి అరిగిపోతాడు. మైక్రోప్లాస్టిక్ విషయంలో మాత్రం ఇలాంటి ముగింపును ఊహించలేం. ఎందుకంటే, ప్లాస్టిక్ చిరాయువు. జీర్ణ వ్యవస్థకు సైతం సవాలు విసురుతుంది. అసలు అగస్త్య మహర్షి వాతాపి ఇచ్చిన విందుకు వెళ్లకపోయి ఉంటే... సమస్యే ఉండేది కాదు. తపోశక్తిని ఖర్చు చేసుకోవాల్సిన ఇబ్బందీ తప్పేది. మనకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. 'ప్లాస్టిక్‌ను కొనం. ప్లాస్టిక్‌లో తినం' అని తీర్మానించుకోగలిగితే సగం సమస్య పరిష్కారం అయినట్టే. మిగతా సగం పాలకుల బాధ్యత, చట్టాల పని. అయినా, రేపటి తరాలకు మనం ఇవ్వాల్సింది... ప్లాస్టిక్ కరెన్సీనో, ప్లాస్టిక్ సామగ్రినో, ప్లాస్టిక్ వ్యర్థాలో కాదు. ప్లాస్టిక్ పెనుముప్పులేని స్వచ్ఛమైన ప్రపంచాన్ని! ★

వీళ్ల ఆలోచన అదిరిపోయిందిగా..!

అప్పుడప్పుడే అంకురిస్తున్న తమ సంస్థల కోసం పెట్టుబడులు అభ్యర్థించడం అన్నది... ఏ ఆఫీసు గదుల్లోనో, మీటింగ్ హాళ్లలోనో జరిగే సాదాసీదా వ్యవహారం. దానిక్కాస్త నాటకీయతనీ, సస్పెన్స్‌నీ చేరిస్తే... అదే 'షార్క్‌ట్యాంక్' కార్యక్రమం. ఇటీవలే ముగిసిన నాలుగో సీజన్‌లో సుమారు 160 సంస్థలు పాల్గొంటే... 89 మాత్రమే పెట్టుబడులు సాధించాయి. వాటిల్లోనూ ఈ మూడూ విభిన్న పరికరాలూ ఆలోచనలతో నిర్వాహకులను ఆకట్టుకున్నాయి.

ఆ పాదాలు... మెప్పించాయి!



ఫ్యూప్రో... వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో పురుడు పోసుకున్న స్టార్టప్. ఉగ్రవాదుల దాడుల్లో కాళ్లు కోల్పోయిన వీరజవాన్ల స్ఫూర్తితో ఏర్పడింది. వీఐటీ పూర్వ విద్యార్థులు నిమిష్ మెహ్రా, సిరిల్ జో బేబీ దీని వ్యవస్థాపకులు. మామూలుగా మన గుండె నుంచి పాదాలకీ, పాదాల నుంచి గుండెకీ రక్తం సరఫరా అవుతూ ఉంటుంది. కానీ ఏదైనా ప్రమాదంతో కాలు కోల్పోయినవాళ్లకి- పాదాల నుంచి గుండెకి అందాల్సిన రక్తం సాఫీగా రాదు. దాంతో గుండెకొట్టుకునే వేగం పెరిగి... వీళ్లలో రక్తపోటు వస్తుంది. పాశ్చాత్యదేశాల్లో కృత్రిమ పాదాలు తయారుచేసేవాళ్లు ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుంటారు. మామూలు కాళ్లలాగే వాటికి స్ప్రింగ్ యాక్షన్ ఉండేలా చూసి... రక్తపోటులో మార్పు రాకుండా జాగ్రత్తపడతారు. కాకపోతే అలాంటి కృత్రిమ అవయవాల ధర కనీసం మూణ్నాలుగు లక్షలైనా ఉంటుంది. కానీ అదే నాణ్యతతో కూడిన కృత్రిమ అవయవాలని కేవలం రూ.18 వేలకే అందివ్వడం ఫ్యూప్రో ప్రత్యేకత. ఏఐ డిజైన్ సాయంతో అతితక్కువ ఖర్చయ్యే పాలియురిథేన్ అనే పాలీమర్‌తో వీటిని రూపొందించారు. ఈ ఆవిష్కరణ కోసమని అయిదు పేటెంట్లు సాధించింది ఫ్యూప్రో సంస్థ. వీటిని ప్రస్తుతం వికలాంగ క్రీడాకారులూ వాడుతున్నారు! అలా అన్షుల్ అనే ఓ పర్వతారోహకుడు షార్క్‌ట్యాంక్ కార్యక్రమానికి వచ్చి ఆశ్చర్యపరిచాడు. ఇంకేం... రూ.60 లక్షల పెట్టుబడులు అందించింది షార్క్‌ట్యాంక్!





వాడిన నూనెని కొంటారు..!

మీ ఇంట్లో ఓ శుభకార్యం. దండిగా బంధువులొచ్చారు. వాళ్ల కోసం పిండివంటలూ అవీ చేశాక... వాడిన నూనె భారీగా మిగిలిపోయింది. ఇంటి అవసరానికిక పనికిరాదు అనిపించింది... అప్పుడేం చేస్తారు! మామూలుగా దాన్ని మనం బయట పార బోస్తాం. కానీ అదే 'ఎకాయిల్' సంస్థకి కబురంపితే ఇంటికొచ్చి మరీ ఆ నూనెని తీసుకుంటారు. ఊరికే కాదు... దాని అసలు ధరలో సగం చెల్లిస్తారు! తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌ల్లోని అన్ని ప్రధాన నగరాలూ పట్టణాలతోపాటూ దేశంలోని ఎనిమిదివందల పైచిలుకు ప్రాంతాల్లో ఎకాయిల్ ఈ సేవలందిస్తోంది. హోటళ్లలోనూ ఇళ్లలోనూ వృథా నూనె ఉంటే వాళ్ల వెబ్‌సైట్‌లోనో యాప్‌లోనో లేదా 18008903841 అనే టోల్‌ఫ్రీ నంబర్‌లోనో చెబితే చాలు. నూనెని పదేపదే వాడటం వల్ల ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యల్ని తగ్గించడం, వాటి వల్ల పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పుని నివారించడం ఎకాయిల్ లక్ష్యం. ఇలా మన నుంచి తీసుకున్న నూనెని ఈ సంస్థ తనదైన పద్ధతిలో జీవ ఇంధనం(బయో డీజిల్)గా మార్చి... ఐఓసీఎల్, బీపీసీఎల్ వంటి చమురు సంస్థలకీ, ప్రభుత్వ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకి విక్రయిస్తోంది. రాజస్థాన్‌కి చెందిన సుశీల్ వైష్ణవ్, తన భార్య కృతితో కలిసి ఈ సంస్థని స్థాపించాడు. సంస్థ విస్తరణ కోసం షార్క్ ట్యాంక్ 50 లక్షల రూపాయలు పెట్టుబడిగా అందించడం విశేషం.





ఓ క్యాన్సర్ బాధితుడి కల..!

డాక్టర్ సిద్ధాంత భార్గవకి 19 ఏళ్లు ఉన్నప్పుడే లూపస్ అనే తీవ్ర యాంటీ ఇమ్యునిటీ సమస్య వచ్చింది. దానితో పోరాటం ఓ కొలిక్కి వచ్చాక పాతికేళ్లప్పుడు థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్టు తేలింది! దాన్ని ఎదుర్కొంటూనే ఎంబీబీఎస్ చేశాడు. దాంతోపాటూ ఓ వినూత్న పరికరాన్నీ ఆవిష్కరించాడు. మనం ఎప్పుడు ఏ ఆందోళనలో ఉన్నా దాన్నంతటినీ ఇట్టే దూరం చేస్తుందది. ఓ ప్లాస్టర్‌లా దాన్ని చెవి వెనక అతికించుకుంటే చాలు... పది నిమిషాల్లో ఆందోళన చేత్తో తీసినట్టు మాయమవుతుందట. ఎలాగంటారా... మన శరీరంలో వేగస్ అనే నరాల సముదాయం ఉంటుంది. మెదడు నుంచి ఉదరం దాకా కుడి ఎడమలుగా ఈ నరాలు సాగుతుంటాయి. మన గుండె కొట్టుకునే వేగాన్నీ, జీర్ణవ్యవస్థలనీ, ఆందోళనలనీ ఇవే నియంత్రిస్తుంటాయి. ఈ నరాలని బయటి పరికరాలతో ప్రేరేపించడం ద్వారా పక్షవాతంతో పడిపోయిన చేతుల్నీ బాగు చేయొచ్చు. అందుకే అమెరికాలో దీన్నో చికిత్సగానే గుర్తిస్తున్నారు. ఈ వేగస్ నరాల్ని ప్రేరేపించి... ఆందోళనలనీ తగ్గించొచ్చని గుర్తించాడు డాక్టర్ భార్గవ. అమెరికాలోలా ఖరీదైన పరికరాల అవసరం లేకుండా కేవలం శబ్దతరంగాలతో ఆ పని చేయొచ్చని నిరూపించాడు. అలా ఇన్నర్‌గైజ్ అనే పరికరాన్ని సృష్టించి... అదే పేరుతో -తన మిత్రులు మితాంశ్ ఖురానా, షల్మలి కడూలతో కలిసి- స్టార్టప్ పెట్టాడు. అందులో కోటి రూపాయల పెట్టుబడుల కోసం షార్క్‌ట్యాంక్‌ని ఆశ్రయిస్తే...షార్క్‌లు ఆ మొత్తాన్ని ఇచ్చేశారు. ఆంత్రప్రెన్యూర్‌గా ఇప్పటికే తానేమిటో నిరూపించుకున్న భార్గవ ఏడాదికి కోటిరూపాయలపైగా ఇన్నర్‌గైజ్ పరికరాలని విక్రయిస్తున్నాడు. ఈ మధ్యే 'ఫోర్బ్స్ అండర్ 30' జాబితాలోనూ స్థానం సంపాదించాడు!







అన్నీ పానీయాలే. కానీ పూర్తిగా తియ్యగా ఉండవు. అలాగని ఉప్పగానూ అనిపించవు. బదులుగా తీపి, పులుపు, ఉప్పు, చిరుకారం మేళవింపుతో నోరూరిస్తాయి. కొద్దిగా తీసుకున్నా చాలు... అపారమైన ఆరోగ్యాన్ని అందిస్తాయి. అదే మరి ఈ ఫర్మెంటెడ్ పానీయాల ప్రత్యేకత. రకరకాల రుచుల్లో దొరుకుతున్న ఇవి... ఇప్పుడు ఫుడ్‌ట్రెండ్స్‌లో మొదటి వరుసలో నిలుస్తున్నాయి. ఎందుకో తెలుసుకోండి మరి.



పులిసిన పానీయం పదిలం ఆరోగ్యం!

నీరసం తగ్గడానికి బత్తాయిరసం తాగుతాం. హెర్బల్‌టీలు తీసుకుంటే జలుబు, దగ్గు వంటివాటినుంచి ఉపశమనం కలుగుతుంది. అజీర్తి, కడుపు ఉబ్బరం తగ్గేందుకు గ్లాసు వేడినీళ్లో, వాము నీళ్లో తాగడం చాలామంది చేసేదే. ఇలా సమస్యను బట్టి రకరకాల పానీయాలు తాగాలంటే ఆ పదార్థాలన్నీ మన వంటింట్లో ఉండాలి. తయారుచేసుకోవాలన్నా కాస్త పనే. ఆ శ్రమను తగ్గిస్తూ కేవలం ఒక్క జ్యూస్‌తోనే బోలెడన్ని లాభాలు సొంతం చేసుకోవాలనుకునేవారికోసం అందుబాటులోకి వచ్చినవే ఫర్మెంటెడ్ జ్యూస్‌లు. వీటిల్లో కంబూచా, కవాస్, కెఫియర్, కాంజి, ఐరాన్... వంటి రకాలెన్నో ఉన్నాయి. ఒకప్పుడు పులియబెట్టిన పదార్థాలంటే పెరుగు, మజ్జిగ, ఊరగాయలు, ఇడ్లీ - దోశ వంటివి మాత్రమే. కానీ మాస్టర్‌షెఫ్‌లు కొన్ని ప్రయోగాలు చేసి ఇలా ఫర్మెంటెడ్ పానీయాలను తీసుకురావడంతో ఇప్పుడు వీటికి బాగా డిమాండు పెరిగింది.

ఎందుకు తీసుకోవాలంటే...

సాధారణ పండ్లు లేదా కూరగాయల రసాల తయారీ తేలిక. కావాల్సిన పండ్ల ముక్కలు లేదా కూరగాయ ముక్కల్ని మిక్సీలో వేసుకుని సరిపడా నీళ్లతో మెత్తగా చేసుకుని... రుచికోసం తేనె, ఉప్పు, మిరియాలపొడి, సైంధవ లవణం వంటివి కలిపితే సరిపోతుంది. కానీ.. ఈ ఫర్మెంటెడ్ జ్యూస్‌ల తయారీ కాస్త భిన్నంగా ఉంటుంది. వీటిని పూర్తిగా పులియబెట్టి తయారుచేస్తారు. ఆయా పండ్లూ, కూరగాయముక్కలకు రుచిని బట్టి ఉప్పు, ఆవపొడి, జీలకర్రపొడి వంటివి కలిపి.. రెండు నుంచి అయిదురోజులపాటు పులియబెడతారు. ఉదాహరణకు కవాస్‌ను బీట్‌రూట్‌తో తయారుచేస్తారు. బీట్‌రూట్ ముక్కల్ని ఓ గాజు సీసాలో తీసుకుని సరిపడా ఉప్పు వేసి, నిండా నీళ్లు పోసి అల్లం, నిమ్మరసం వంటివి వేస్తారు. దీన్ని రెండుమూడురోజులు పులియబెడితే కవాస్‌రెడీ అయినట్లే. కాంజి తయారీలో బీట్‌రూట్ లేదా క్యారెట్ ముక్కలకు ఆవ పొడి, ఉప్పు, కొద్దిగా కారం, పసుపు వంటివి తగు మోతాదులో వేస్తారు. ఇక, మజ్జిగలో పుదీనా, తగినంత ఉప్పు, ఇతర పదార్థాలను చేర్చి ఐరాన్‌ను చేస్తారు. అదే కెఫియర్‌ను పాలు, కెఫియర్ గింజలు, చక్కెర కలిపి పులియబెట్టి చేస్తారు. ఇందులో వేసే కెఫియర్ గింజల్ని బ్యాక్టీరియా, ఈస్ట్‌తోపాటు మరికొన్ని పదార్థాలను కలిపి... క్యాలీఫ్లవర్ పువ్వుల్లా తయారుచేస్తారు. అదేవిధంగా కంబూచా గురించీ చెప్పుకోవాలి. ఎక్కువ మందిని ఆకట్టుకుంటున్న ఈ పులియబెట్టిన బ్లాక్‌టీని మేలుచేసే బ్యాక్టీరియా, చక్కెర, టీపొడి, ఈస్ట్‌తో కలిపి తయారుచేస్తారు. ఇలా తయారుచేసిన కంబూచాకు ఇప్పుడు మామిడి, స్ట్రాబెర్రీ, పీచ్, ఆపిల్, ద్రాక్ష... వంటి పండ్ల సుగుణాలనూ జతచేసి ఇంకాస్త ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు.


ఈ పానీయాలన్నీ వాటి తయారీని బట్టి పుల్లగా, తియ్యగా, కారం కలగలిసిన రుచుల్లో వస్తూ నోరూరిస్తాయి. శరీరానికి బోలెడన్ని పోషకాలను అందించడంతోపాటు ఆరోగ్యానికీ మేలుచేస్తాయి. ఎలాగంటే... కంబూచా టీలో ప్రోబయోటిక్స్ ఎక్కువ ఉండటం వల్ల ఇవి గట్ ఆరోగ్యాన్ని కాపాడతాయి. బీట్‌రూట్ కవాస్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది. కెఫియర్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. కాంజిని తీసుకుంటే గట్ ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు కాలేయ పనితీరూ బాగుంటుంది. రక్తంలో చక్కెరస్థాయులూ అదుపులో ఉంటాయి. ఐరాన్ పానీయం దాహాన్ని తీర్చడమే కాకుండా ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. ఇంకా.. ఇవన్నీ మానసిక ప్రశాంతతనూ కలిగిస్తాయి. చర్మ ఆరోగ్యాన్నీ కాపాడతాయి. అదనంగా విటమిన్లూ, యాంటీఆక్సిడెంట్లూ సమృద్ధిగా అందుతాయి. శరీరం అన్నిరకాల పోషకాలనూ త్వరగా స్వీకరించేలానూ చేస్తాయి. ఫ్రీరాడికల్స్ తగ్గడంతోపాటు గుండె ఆరోగ్యమూ మెరుగుపడుతుందని అంటారు నిపుణులు. అయితే... వీటన్నింటినీ ఇలా పులియబెట్టడం, వడకట్టుకోవడం కష్టం అనుకునేవారికోసం రెడీమేడ్‌గానూ లభిస్తున్నాయి కాబట్టి నచ్చినవాటిని ఎంచుకోవచ్చు. అదండీ ఈ ఫర్మెంటెడ్ పానీయాల కథ. సో... మీరు ఇష్టపడే రుచిని బట్టి... వీటిల్లో ఏదో ఒకదాన్ని ప్రయత్నించి చూడండి మరి. ★















ఆర్తజన రక్షకుడు, పిలిస్తే పలికే దేవదేవుడు, భక్తుల పాలిట కొంగుబంగారం, వడ్డికాసులవాడు... ఇలా వేంకటేశ్వరస్వామిని భక్తులు వేలపేర్లతో పిలుస్తారు. మనసారా నమ్మి కొలుస్తారు. ఆ స్వామి ఇప్పుడు పదహారు అడుగుల్లో, పసిడికాంతులతో, అభయ- వరద ముద్రలతో దర్శనం ఇస్తున్న క్షేత్రమే స్వర్ణగిరి. వెంకన్న సప్తగిరులు దాటి స్వర్ణగిరిలో కొలువుదీరాడా అని భక్తులు తన్మయత్వం చెందేలా కనిపించే ఆయన రూపం, ఈ దేవాలయం... రెండూ ఎంతో సుందరం, నయనానందకరం.

స్వర్ణగిరి... మరో సప్తగిరి!



స్వర్ణగిరి... అలవైకుంఠాన్ని పోలిన నిర్మాణంతో ఇరవైరెండు ఎకరాల్లో కట్టిన అత్యద్భుతమైన శ్రీవారి దివ్యధామం. పేరుకు తగినట్లుగానే ఇక్కడ స్వామి స్వర్ణమయ కాంతులతో విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిస్తాడు. అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ, వేంకటనాథుడు కొలువుదీరిన ఈ ఆలయం తెలంగాణ జిల్లా, భువనగిరి శివారులోని మానేపల్లి హిల్స్‌పైన ఉంది.

శ్రీకారం చుట్టారిలా...

దేశవ్యాప్తంగా- పల్లవ, చోళ, చాళుక్య, హొయసల, విజయనగర, కాకతీయ రాజులు నిర్మించిన ఎన్నో ఆలయాల వైభవాన్ని స్ఫూర్తిగా తీసుకుని రూపొందించిన ఈ స్వర్ణగిరి నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. ఈ క్షేత్రాన్ని మానేపల్లి జ్యువెలర్స్ యజమాని మానేపల్లి రామారావు నిర్మించారు. వేంకటేశ్వరస్వామికి పరమభక్తుడైన రామారావు తన షష్టిపూర్తి అయ్యాక వ్యాపార వ్యవహారాలన్నీ పిల్లలకు అప్పగించి, విశ్రాంత జీవితాన్ని స్వామిసేవకు అంకితం చేయాలనే ఆలోచనతో 2013లో ఇక్కడ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ పనులు మొదలుపెట్టినా అవి వేగంగా సాగక ఆపేశారు. ఇది జరిగిన మూడేళ్లకు రామారావు సతీమణి విజయలక్ష్మి లిఫ్టు కూలడంతో... ప్రమాదానికి గురై కోమాస్థితికి చేరుకోవడంతో కోలుకోవడం కష్టమన్నారు వైద్యులు. ఆమె ఆసుపత్రిలో ఉన్నప్పుడు రామారావు కుమారుడి స్నేహితుడు తిరుపతి నుంచి వస్తూ స్వామి వారి ప్రసాదాన్ని అందించాడట. అప్పుడు, తన భార్య త్వరగా కోలుకుంటే ఎలాగైనా ఆలయాన్ని నిర్మిస్తానంటూ మొక్కుకున్నారట రామారావు. చాలా తక్కువ సమయంలోనే ఆవిడ కోలుకోవడంతో ఇదంతా వేంకటేశ్వరస్వామి దయ వల్లే జరిగిందని భావించిన రామారావు కుటుంబం, 2016లో రెండోసారి శంకుస్థాపన చేసి... స్థపతి డీఎన్‌వీ ప్రసాద్ సూచనలతో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇది పూర్తయ్యేందుకు ఎనిమిదేళ్లు పట్టిందని వివరిస్తారు రామారావు కుటుంబ సభ్యులు. పాంచరాత్ర ఆగమ, తెన్నాచార్య సంప్రదాయాలను అనుసరిస్తూ నిర్మించిన ఈ ఆలయం తెలంగాణలోని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో హైదరాబాద్- భూపాలపట్నం జాతీయ రహదారి- 163కు దగ్గరగా ఉంది.



నిత్య కల్యాణంతో అలరారుతూ...

అల్లంత దూరం నుంచి కనిపిస్తూ, నాలుగు గోపురాలతో ఆకట్టుకుంటూ, స్వాగత తోరణంతో, బ్రహ్మరథంతో... భక్తులను స్వాగతిస్తుంది స్వర్ణగిరి. అది దాటితే నాలుగు అడుగుల ఎత్తులో శ్రీవారి పాదాలు దర్శనం ఇస్తాయి. వాటిని తనివితీరా స్పృశించి, అక్కడినుంచి 108 మెట్లు ఎక్కి లోపలికి చేరుకోవాలి. అలా వెళ్లే క్రమంలో దశావతారాల రూపాలూ, గోడలపైన రాసిన గోవింద నామాలూ ఆకట్టుకుంటాయి. వాటిని పఠిస్తూ ముందుకు సాగే భక్తులకు - ఆనంద మండపంలో పసిడి గోపురం నీడన, సుమారు వంద కేజీల నవరత్న ఖచిత స్వర్ణమణిమయ ఆభరణాలను దాల్చి- పదహారు అడుగుల్లో వేంకటేశ్వరస్వామి దర్శనమిస్తాడు. తిరుమల తరహాలోనే నిత్య కైంకర్యాలను అందుకుంటున్న శ్రీవారితో పాటుగా శ్రీదేవి- భూదేవిలను కూడా పూజించొచ్చు. ఆ తర్వాత అలమేలుమంగ, గోదాదేవి, మదనగోపాల కృష్ణస్వామి, గరుడాళ్వార్, రామానుజాచార్య, శ్రీలక్ష్మీనరసింహస్వామి, భూ వరాహస్వామి, వకుళమాతలు కొలువైన ఉపాలయాలనూ చూడొచ్చు. 'భక్తులకు తిరుమలను దర్శించుకున్న అనుభూతిని కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఆలయాన్ని నిర్మించాం. ఇక్కడ వేకువజామున అయిదు గంటలకే స్వామివారికి సుప్రభాత సేవతో ఆలయం తెరుచుకుంటుంది. మళ్లీ రాత్రి తొమ్మిది గంటలకు ఏకాంత- పవళింపు సేవలతో పూజా కార్యక్రమాలు ముగుస్తాయి. ఆ దేవదేవుడికి ప్రతిరోజూ ఆర్జిత సేవలతోపాటుగా... తోమాల, పూలంగి సేవలు... సువర్ణ అష్టదళ పద్మార్చన, సువర్ణ పుష్పార్చన - తిరుప్పావడ... ఇలా వారమంతా విశేషమైన పూజలుంటాయి. స్వామి- అమ్మవార్ల జన్మనక్షత్రం రోజున ప్రత్యేక పూజలతోపాటుగా సహస్రనామార్చన, తీర్థగోష్ఠి చేస్తాం. అదేవిధంగా వైభవోత్సవ మండపంలో రోజూ స్వామివారి కల్యాణం ఉంటుంది. ఇక్కడ ఒకేసారి పన్నెండువందల మంది కూర్చుని ఆ కల్యాణాన్ని చూడొచ్చు. ఇంకా, రోజూ సాయంత్రం మాడవీధుల్లో తిరువీధోత్సవం, సహస్ర దీపార్చనలను చూసి తీరాల్సిందే...' అంటూ వివరిస్తారు నిర్వాహకులు. అలాగే, పవిత్రోత్సవాలూ, వైకుంఠ ఏకాదశికి పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాన్ని అంగరంగవైభవంగా జరుపుతారు. వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి పాదాలపైన సూర్యకిరణాలు పడే తీరును చూసి తీరాల్సిందే.



అన్నప్రసాదాలు స్వీకరించేలా...

స్వర్ణగిరి క్షేత్రం... నాలుగువైపులా ఆకాశాన్నంటే నాలుగు గోపురాలు, నాలుగు వీధులు, నాలుగు మార్గాలతో ఆకట్టుకుంటుంది. వాటికి భువనగిరి కోటను స్ఫూర్తిగా తీసుకుని భువనైకమల్ల, త్రైలోక్యమల్ల, త్రిభువనమల్ల, రాయగజ కేసరి అని పేర్లు పెట్టారు. ఈ ఆలయంలో యాభైనాలుగు అడుగుల ఎత్తులో మానేపల్లి విజయస్తంభాన్నీ ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. సుమారు మూడువందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ఆలయంలో ఇతర విశేషాలూ కనిపిస్తాయి.

★ తూర్పు వైపున హంపీరథంపైన ఇరవైఏడు అడుగుల్లో కార్యసిద్ధి హనుమాన్ విగ్రహం భక్తుల్ని ఆకట్టుకుంటుంది. ఆ పక్కనే 1500 కిలోల బరువున్న భారీ జయగంట కనిపిస్తుంది. తిరుమల తర్వాత అలాంటి జయగంట ఇక్కడే ఉండటం విశేషం.

★ పశ్చిమం వైపున వంద అడుగుల స్తంభంపైన పదిహేను అడుగుల్లో పంచలోహ గరుడాళ్వార్‌ను దర్శించుకోవచ్చు. అలాగే విమాన గోపురాన్నీ, విమాన వేంకటేశ్వరస్వామినీ, అద్దాల మండపాన్నీ చూసి తీరాల్సిందే.

★ నాలుగు మండపాల మధ్య పదివేల చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పుష్కరిణిలో శ్రీమన్నారాయణుడు శయనరూపంలో కనిపిస్తూ జలనారాయణస్వామిగా పూజలు అందుకుంటున్నాడు.

★ ఆలయం పక్కనే ఉన్న వైభవోత్సవ మండపంలోనే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇక్కడే వంటశాల, అన్నదాన సత్రం ఉంటాయి. ఈ సత్రంలో ఒకేసారి రెండువేలమంది కూర్చుని భోజనం చేయొచ్చు.

★ స్వర్ణగిరికి వచ్చే భక్తులకోసం కాటేజీలూ ఉన్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించాలనుకుంటే ఆన్‌లైన్‌లోనే సేవలు బుక్ చేసుకోవచ్చు.

- వెంకట శ్రీనివాస్ గోనె, న్యూస్‌టుడే, భువనగిరి





భోజనంలోకి కూరలు ఎన్నున్నా, పప్పు లేనిదే ముద్ద దిగదు కొందరికి. పోషకాహారంగా దానికిచ్చే ప్రాధాన్యతనో, ఎవరికైనా నచ్చే ప్రత్యేకమైన రుచో- కారణమేదైనా కానీ పప్పు ప్రతి ఇంటా, రోజూ ఆహారంలో తప్పనిసరైపోయింది. అంత డిమాండ్ ఉన్న పప్పుకు కొరత రావొద్దంటే సాగులోనూ ఇది ముందు ఉండాలి కదా! అందుకే శాస్త్రవేత్తలు నీరు లేకపోయినా, ఎండ ఎక్కువున్నా... ఏడాదిలో మూడుసార్లు చేతికొచ్చే కంది రకాన్ని సృష్టించారు. రైతన్నల కష్టాల్ని తీర్చే, ఆ కంది విశేషాలేంటో మనమూ చూద్దామా...





కరవుకీ... 'కంది'పోని పంట!





అన్నం-పప్పు... దాదాపుగా ఇదే కదా మన అసలైన ఆహారం. అందుకే మన దగ్గర వరితోపాటు కందికీ గిరాకీనే! అయితే ఈ పంట దిగుబడికి వాతావరణ అంశాలు అనుకూలించాలి. కానీ ఇప్పుడు అందుకు చక్కటి పరిష్కారం దొరికింది. సంప్రదాయ కంది రకాలకు భిన్నంగా- ఎండను తట్టుకుంటూ, తక్కువ నీరు, కనీస ఎరువుల వినియోగంతో... అతి తక్కువ కాలంలో, ఎక్కువ దిగుబడిని ఇచ్చే కొత్త వంగడం వచ్చింది. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్టప్రాంత పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్) ఈమధ్యనే 'ఐసీపీవీ 25444' పేరుతో సరికొత్త కంది రకాన్ని అభివృద్ధి చేసింది. అన్నదాతలకు అద్భుతమైన వరం లాంటి ఆ కంది ప్రత్యేకతలేంటంటే...

ఏడాదికి మూడు పంటలు...

కంది పంట కాలం- ఆరు నెలలు. దీనికి నీళ్లు అవసరం, చీడపీడల బెడదా ఎక్కువే. ఆరు నుంచి ఏడు అడుగుల ఎత్తు పెరుగుతుంది ఇది. అన్నీ బాగుంటే ఎకరానికి అయిదు క్వింటాళ్ల వరకూ మాత్రమే పండుతుంది. కానీ ఇప్పుడు కంది పంటను ఏడాది పొడవునా పండించే పంటగా మార్చారు. ఈ కొత్త 'ఐసీపీవీ 25444' వంగడాన్ని ప్రతి నాలుగు నెలలకోసారి వేయొచ్చు. నాలుగుసార్లు నీరు పారిస్తే చాలు. పైగా 45 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతల్లోనూ పండుతుంది. ఎకరానికి టన్ను దిగుబడి వస్తుంది. మొక్క తక్కువ ఎత్తు, సన్నగా ఉండటం వల్ల ఎకరం విస్తీర్ణంలో సాధారణ పంట కన్నా 30 శాతం అధికంగా మొక్కల్ని నాటొచ్చు. తక్కువ ఎత్తు ఉన్నందున యంత్రాలతో కోత కోయొచ్చు, అంటే చాలా వరకూ కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. ఇంకా ఎరువుల వినియోగమూ తక్కువే. ప్రస్తుతం క్వింటాలుకు రూ.9 వేల చొప్పున కందికి ధర ఉండగా... ఈ కొత్తరకం కందితో ఎకరానికి ఏడాదిలో దాదాపు రూ.2.70 లక్షల వరకూ రైతుకు ఆదాయం వస్తుందన్నమాట. సాగులోనే కాదు, దీన్ని రుచిలోనూ మేటిగానే చెప్పొచ్చు, త్వరగా ఉడుకుతుంది కూడా. దీంట్లో అధిక మోతాదులో ఫోలిక్ యాసిడ్లు, ప్రొటీన్లు, కొవ్వులూ, విటమిన్లూ, ఖనిజాలూ ఉన్నాయంటున్నారు శాస్త్రవేత్తలు.

ఏంటి దీని ఉపయోగం...

మనదేశంలో వరి, గోధుమల తర్వాత అత్యధిక వినియోగంలో ఉండే ఆహార పంట కంది. ప్రపంచంలో ప్రస్తుతం సాగయ్యే కంది పంట మొత్తంలో 63 శాతం మన దేశానిదే. మనతోపాటూ ఆసియా దేశాల్లోనూ కందిపప్పు వాడకం ఎక్కువే. కానీ కంది ఉత్పాదకత చాలావరకూ తగ్గిపోయింది. ఇతర దేశాల్లో, మన దగ్గరా పప్పు దినుసుల కొరత పెరిగిపోయింది. ఆ నష్టాన్ని భర్తీ చేయాలంటే పంట దిగుబడి పెరగాలి. అందుకు- ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకుంటూ, ఎక్కువ లాభాలిచ్చే మేలైన కంది రకం కావాలి కదా! ఆ ఉద్దేశంతోనే ఇక్రిశాట్ కంది మీద 2021లో పరిశోధనలు మొదలుపెట్టింది. సీనియర్ శాస్త్రవేత్త గంగశెట్టి ప్రకాశ్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు బెలియప్ప శృతి, బొమ్మ నరేశ్‌ల బృందం కొత్త కంది వంగడాన్ని తయారు చేసే పనిలో పడింది. ప్రత్యేక గదుల్లో, కృత్రిమ వెలుగుల మధ్య, ఉష్ణోగ్రత, తేమ, పోషకాల స్థాయిని నిర్దేశిత ప్రమాణాల్లో ఉంచుతూ- మొక్క వేగంగా ఎదిగి, అధిగ దిగుబడిని సాధించేలా స్పీడ్ బ్రీడ్ పద్ధతిని ఉపయోగించి, ఈ సరికొత్త కంది వంగడాన్ని తయారుచేశారు పరిశోధకులు. ఇప్పటికే తెలంగాణ, ఒడిశా, కర్ణాటకల్లో దీన్ని ప్రయోగాత్మకంగా సాగు చేయించి, మంచి ఫలితాల్నీ అందుకున్నారు.

ప్రతికూలతలన్నింటినీ తట్టుకుంటూ మంచి లాభాలు ఇచ్చే ఈ కంది రకం... నిజంగా అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడుతుంది, కంది ఉత్పత్తిని మరెంతో పెంచుతుంది. అతి త్వరలో ఈ కంది విత్తనాలు రైతులందరికీ అందుబాటులోకి రానున్నాయట!

– ఆకారపు మల్లేశం, ఈనాడు, హైదరాబాద్





నాటి బిచ్చగాడు... అనాథలకి అన్నయ్యాడు!



ఏపీ07 డీఎన్ 4567... అతని బుల్లెట్ బండి నంబరు ఇది. ఆ బండి మీద- సంచులనిండా బ్రెడ్ పొట్లాలూ, రేషన్ సరకులూ, దుప్పట్లూ, చెప్పులూ వంటివెన్నో మోసుకెళ్తుంటాడు పుట్టి జాషువా డేనియల్. ఎక్కడ అన్నార్తులు కనిపించినా వాటిని పంచుతుంటాడు. ఇప్పటిదాకా అలా బైక్‌పైనే ఇరవై దేశాలకెళ్లాడు! ప్రయాణాలు లేనిరోజుల్లో తాను ఏర్పాటుచేసిన అనాథాశ్రమాల్లో గడుపుతాడు. అవసరమైన చిన్నారులకి లక్షలు ఖర్చుపెట్టి సర్జరీలు చేయిస్తుంటాడు! ఇంతకీ ఎవరీ జాషువా...



జాషువా... ఒకప్పుడు బిచ్చగాడిగా బతికినవాడు. చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో, ఎండిన డొక్కలతో, ఆకలి నిండిన కళ్లతో రైల్వే స్టేషన్‌లలో తిరిగినవాడు. ప్రయాణికులు ఏ మిగిలిన ఆహారమో పడేస్తే తిన్నవాడు. రైల్వే పోలీసుల లాఠీ దెబ్బలు రుచిచూసినవాడు. వినుకొండ దగ్గర్లోని బండ్లమోటు అనే కుగ్రామం జాషువాది. తల్లిదండ్రులిద్దరూ అక్కడో చర్చ్‌ని నిర్వహిస్తుండేవారు. కానీ వాళ్ల నాన్న చిన్నప్పటి నుంచీ చాలా కటువుగా కరకుగా ఉండేవాడట. ఒక్క మార్కు తగ్గినా చావకొడుతుండేవాడట. పదో తరగతి తర్వాత ఆ కాఠిన్యం మరింత పెరగడంతో ఇంటి నుంచి పారిపోయానంటాడు జాషువా. 'నాకు దొరికిన ట్రైనేదో ఎక్కేశాను. కాసేపటి తర్వాత ఆకలేసింది. అందులోని అనాథ పిల్లలు బిచ్చమెత్తడం చూసి నేనూ అలాగే చేశాను. ఆ ట్రైన్ దిల్లీకెళితే వాళ్లతోపాటే దిగాను. అలా రెండున్నరేళ్లు... ఏవేవో స్టేషన్‌లలో గడిపాను. ఓ దశలో నాతోటి పిల్లల కోసం ఏదైనా చేయాలనిపించింది. ఇంటికెళితేగానీ అది సాధ్యం కాదనిపించింది. అది బలమైన నిశ్చయంగా మారడానికి ఓ సంఘటన కారణమైంది. అదో వర్షాకాలం... వరసగా మూడురోజులపాటు ఏ ఆహారమూ దొరకలేదు. వెతగ్గా వెతగ్గా ఓ చెత్త బుట్టలో పాత బ్రెడ్ ప్యాకెట్ కనిపించింది నాకు. దాన్ని తీసి ఒక ముక్క నోటపెట్టానో లేదో... నా చుట్టూ నలుగురు పిల్లలు మూగారు. నాకన్నా చిన్నవాళ్లు... నాతోపాటే పస్తులుంటున్నవాళ్లు. నాకు కన్నీళ్లు ఆగలేదు... చేతిలో ఉన్న ప్యాకెట్ వాళ్ళకు ఇచ్చేశాను. ఆ క్షణమే ఇంటి దారి పట్టాను...' అని గుర్తుచేసుకుంటాడు జాషువా.

17 ఏళ్లకే...

'నాన్న నన్ను చూడగానే కొడతాడనుకున్నా కానీ... కన్నీళ్లు పెట్టుకున్నాడు. వెళ్లిన రోజే- 'అనాథ పిల్లలకు సేవ చేస్తాను నాన్నా' అని చెప్పేశాను. ఆ తర్వాతి వారమే ఆయన విశాఖపట్నంలోని ఓ అనాథాశ్రమంలో పనికి కుదిర్చాడు. అక్కడో వందమంది పిల్లలుంటే- ఉదయాన్నే వాళ్లని నిద్రలేపడం, స్నానం చేయించడం, బడికి తీసుకెళ్లడం... ఇలా అన్ని పనులూ ఇష్టంగా చేశాను. ఐదేళ్ల తర్వాత... ఆశ్రమంలో పరిచయమైన మిత్రులతో కలిసి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ దగ్గర స్పార్టన్ అనే అనాథాశ్రమం స్థాపించాను. అది నిలదొక్కుకున్నాక సొంతూరు వినుకొండకి తిరిగొచ్చి సేవా కార్యక్రమాల్ని మొదలుపెట్టాను. చెంచుగూడేల్లోని పిల్లలూ, మురికివాడల చిన్నారుల్ని బడిలో చేర్పించడం, ఫీజులు కట్టడం, యూనిఫామ్‌లు ఇవ్వడం... వంటివన్నీ చేయసాగాను. వీటన్నింటికీ ప్రతిసారీ స్నేహితులూ దాతల దగ్గర చేయిచాచడం నాకు నచ్చలేదు. అందుకే అప్పు తీసుకుని 'పీజే ఆక్వాఫార్మ్స్' పేరుతో గుంటూరులోనే చేపల చెరువు బిజినెస్ పెట్టాను. వచ్చే ఆదాయంలో 80 శాతం నా సేవాకార్యక్రమాలకనే నిర్ణయించుకున్నాను. ఆ నిధులతోనే వినుకొండలో అనాథాశ్రమం పెట్టాను. హైదరాబాద్‌లోనూ రెండు అనాథాశ్రమాల్ని నడుపుతున్నాను. నన్నెప్పుడూ ఆఫ్రికాలోని ఉగాండా పిల్లల దైన్యం కలచివేస్తుండేది. అందుకే అక్కడికెళ్లి అనాథబాలల్ని దత్తత తీసుకుని ఆశ్రమం ఏర్పాటుచేశాను. ఇలా రెండుదేశాల్లో కలిపి ఏటా 130 మంది పిల్లల బాగోగులు చూస్తున్నాం...' అంటాడు జాషువా. అంతేకాదు...

శస్త్రచికిత్సలు కూడా...

ఆ పాప పేరు సంకల్ప. చక్కగా ఆడుతూ పాడుతూ ఉన్న తను చిన్నపాటి నడకకే తీవ్రంగా ఆయాసపడసాగిందట. పరీక్షిస్తే గుండెలో మూడు రంధ్రాలున్నాయని తేలింది. కూలికెళితేకానీ గడవని ఆ తల్లిదండ్రులకి జాషువా అండగా నిలిచాడు. నాలుగు లక్షల రూపాయల ఖర్చుతో చెన్నైలోని మద్రాసు మెడికల్ మిషన్ ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. అలా రెండేళ్లలో ఎనిమిది మంది చిన్నారుల్ని ఆదుకున్నాడు జాషువా. ఈ సేవలన్నింటికీ ఏటా పాతిక లక్షలదాకా ఖర్చుచేస్తున్నాడు. వీటన్నింటినీ తన 'రైడర్ జోష్ ఫౌండేషన్' ద్వారా నిర్వహిస్తున్నాడు.

ఔను రైడరే'...!

2016 నుంచీ బైక్ రైడర్‌గా దేశవిదేశాలు చుట్టొస్తున్నాడు జాషువా. బైక్‌పైన కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకానే కాదు... 20 దేశాలకీ వెళ్లొచ్చాడు. ఆ అభిరుచికి సేవనీ జతచేస్తున్నాడు. రహదారుల పక్కన కనిపించే భిక్షగాళ్లకి రగ్గులూ, ఆహార పొట్లాలూ, బట్టలూ, మహిళలకి నెలసరి కిట్‌లూ పంచుతుంటాడు. ★



కథ

ఆత్మ బంధువు

– సాయి గౌతమ్

‘ఆపద మొక్కులవాడా... అనాథ రక్షకా... గోవిందా... గోవిందా...’ తిరుమల తిరుపతి వేంకటేశ్వరుణ్ణి దర్శించుకోవడానికి వచ్చిన జనం భక్తి పారవశ్యంతో ఆ దేవదేవుడిని తల్చుకుంటున్నారు. నేను జీవితంలో మొట్టమొదటిసారి తిరుమల వెళ్ళాను.

అప్పటికి క్యూ లైన్‌లోకి వెళ్ళి మూడున్నర గంటలు. జనం అంతసేపు వేచి ఉన్నా, గోవింద నామస్మరణ మటుకు వదల్లేదు. చిన్నపిల్లల్ని సముదాయిస్తున్న తల్లిదండ్రులూ వృద్ధాప్యం మరిచి వచ్చిన పెద్దలూ... అన్ని రకాల జనాలూ లైన్‌లో ఉన్నారు. నాకు నిజానికి భక్తి లేదు. ‘దేవుడే లేడు’ అని నమ్మే నాస్తిక వాదిని.

ఇప్పుడు కూడా- నా కూతురికి తోడుగా రావాల్సి వచ్చింది కానీ లేకపోతే ‘ఇన్నేసి గంటలు లైన్‌లో ఎవరు నిల్చుంటారు’ అన్న వాదన నాది.


చూస్తుండగానే లైన్‌లో నడుచుకుంటూ కంపార్టుమెంటులన్నీ దాటుకుని, ఆ నామస్మరణ వింటూ ఆలయం ప్రధాన ద్వారం వరకూ వచ్చేశాం. గడప దాటి ఒక్కసారి లోపలికి వెళ్ళామో లేదో... ఏదో తెలియని అదృశ్యశక్తి నన్ను చుట్టుముట్టింది. మా అమ్మాయి తన ఏడేళ్ళ కొడుక్కి... “అదేరా, వేంకటేశ్వరుడి గడ్డానికి తగిలిన గునపం” అంటూ అనంతాళ్వార్ కొట్టిన సంగతి చెప్తోంది.

ఇంకా ముందుకి వెళ్తుండగా నాకు మరింత మైకం కమ్మినట్టు అనిపించింది. రంగనాయకుల మండపం దగ్గరకి వచ్చామని లైన్‌లో ఎవరో అంటుండగా వినిపించింది. నా శరీరం నా స్వాధీనంలో లేకుండా పోయింది.

‘ఇంకొద్ది నిమిషాల్లో దర్శనం అయిపోతుంది... రూమ్‌కి వెళ్ళిపోయి రెస్ట్ తీసుకోవచ్చు’ అనుకుంటుండగా ఇలా అయిందేమిటి? ఏదో మాయ ఆవహించినట్టు ఒక్కసారిగా నా అరవై ఏళ్ళ జీవితం నా కళ్ళముందు వాలింది.

★ ★ ★

నాకప్పుడు ఏడేళ్ళు ఉంటాయేమో... స్కూల్ నుండి వచ్చిన నేను అమ్మతో ఆ రోజు జరిగిన విషయాలు చెప్తున్నాను. మా అమ్మ నేను చెప్పేవన్నీ వింటూ అన్నం తినిపిస్తోంది. ఇంతలో నాన్న వచ్చారు. వస్తూనే హుషారుగా వంట గదిలోకి వచ్చి, “సుశీలా... బట్టలు సర్దు. తిరుపతికి టిక్కెట్లు తెచ్చాను” అన్నారు. అప్పటికి తిరుపతి గురించి చూచాయగా వినడమేగానీ ఎప్పుడూ వెళ్ళింది లేదు. కానీ నాన్న ఉత్సాహం చూసి నేను కూడా గంతులేశాను.



ప్రయాణానికి వారం ముందునుండే మా ఇంట్లో హడావుడి మొదలైంది. సరిగ్గా రేపు ప్రయాణం అనగా నాకు విపరీతమైన జ్వరం వచ్చేసింది. అమ్మ ‘ఉండిపోదాం’ అంది. “స్వామి పిలిచినప్పుడే మనం వెళ్ళాలి. వాడిని అమ్మ చూసుకుంటుందిలే, మనం వెళ్ళి వచ్చేద్దాం” అని, నన్ను మా నాన్నమ్మతో వదిలేసి అమ్మని తీసుకుని వెళ్ళిపోయారు నాన్న.

వెళ్ళేముందు అమ్మ నాకు ఎన్నో జాగ్రత్తలూ ధైర్యం చెప్పి బాధగానే వెళ్ళింది. ‘నేను వెళ్ళి, నీకు జ్వరం తగ్గించేయమని ఆ గోవిందుడిని అడుగుతానేం’ అని బుజ్జగించి మరీ చెప్పింది. నా ప్రమేయం లేకుండానే ఆ గోవిందుడు నా తల్లిదండ్రుల్ని తన దగ్గరకి రప్పించుకుంటున్నాడని నాకు ఉక్రోషం వచ్చేసింది.

‘అయినా ఎంతసేపు, కళ్ళు మూసుకుని తెరిచేలోగా వాళ్ళు వచ్చేస్తా’రని నానమ్మ చెప్పి నన్ను మరిపించే ప్రయత్నం చేసింది. కానీ ఆ గోవిందుడిని చూడటానికి వెళ్ళిన అమ్మా నాన్నా తిరిగి రాలేదు. బస్సు బోల్తాపడి అక్కడికక్కడే చనిపోయారట. ఇదే నా జీవితంలో తగిలిన తొలి ఎదురు దెబ్బ.

ఇక ఆ రోజు నుండి ఆ గోవిందుడిని కానీ, మరే దేవుడిని కానీ మొక్కినట్టు కూడా గుర్తులేదు. అంత పిచ్చి కోపం నాకు దేవుడంటే. దేవుడిని ఎవరు పొగిడినా, దణ్ణం పెట్టమని చెప్పినా నాకు నచ్చదు. నేను ఏనాడూ పెట్టలేదు, పెట్టిన వారిని ఆపనూ లేదు. నేను నమ్మను అంతే. నాకు ఇతరుల నమ్మకంతో పని లేదు.

★ ★ ★

అవి నేను యూనివర్సిటీలో చేరిన రోజులు. అమ్మా నాన్నా లేక ఇల్లు గడవడానికే కష్టమై- డిగ్రీ మధ్యలోనే చదువు మానేయమంది నానమ్మ. కానీ ఇన్ని మంచి మార్కులు వచ్చి, టీచర్లందరి పొగడ్తలూ అందుకున్న నేను, చదువు మానేసి కూలి పనికి వెళ్ళడం ఇష్టంలేదు. ఏం చేయాలో నాకు తోచలేదు.

ఆ రోజు ఆదివారం... వీధిలో నడుచుకుంటూ వెళ్తున్నా. అప్పుడే మా ఊరి కరణం గారబ్బాయి గోడ మీద ఏదో రాస్తూ కనబడ్డాడు. దస్తూరీ బాగున్నా ఆ పిల్లాడు రాసిన రెండు వాక్యాల్లో నాలుగు తప్పులు ఉన్నాయి. వాటిని నేను సరిచేసి రాశాను. అది చూసిన కరణంగారు, “నువ్వు మాణిక్యంగారి మనవడివి కదూ” అని అడిగారు అభిమానంగా. అవునన్నట్టు తలాడించాను. “చూశావుగా బాబూ, మా వాడు చదువులో ఎంత వెనకపడ్డాడో! నీకు ఖాళీ ఉన్నప్పుడు వచ్చిపోతూ ఉండు” అన్నారు.

ముందు ఊరికే కాలేజీ అయిపోయాక కాలక్షేపానికి వెళ్ళేవాడిని. నాలుగు రోజుల్లో నేను వాళ్ళ అబ్బాయికి నేర్పే తీరు చూసి, మెచ్చిన కరణంగారు, నెలకి కొంత డబ్బు నాకు ఇవ్వడం ఆరంభించారు. అనుకోకుండా వచ్చిన ఆ అవకాశాన్ని వినియోగించదల్చుకుని ఇంకో నలుగురిని కూడా పోగేసి ట్యూషన్ చెప్పడం మొదలుపెట్టాను. నా కాలేజీ ఫీజుకి పోగా ఇంకా నా ఖర్చులకి కూడా డబ్బులు మిగిలేవి.

డిగ్రీ పూర్తయ్యే నాటికి నేను కూడబెట్టిన

డబ్బులు అక్షరాలా ఐదు వందలు. అది అప్పట్లో చాలా పెద్ద మొత్తం. ఆ ఏడాది మా ఊరి ఉత్సవాలకి నన్ను చందా అడిగారు మా స్నేహితులు. "ఛట్... నేను కష్టపడి సంపాదించుకున్నవి- ఆ కదలని బొమ్మకి ఇవ్వడానికి కాదు" అన్నాను. వాళ్ళు "తప్పు తప్పు, కళ్ళు పోతాయి" అని లెంపలు వేసుకున్నారు. నేను మటుకు ఏం పట్టనట్టు ఊరుకున్నాను.

★ ★ ★

ఎంత చదువున్నా ఏం లాభం, సరైన పెద్దవాళ్ళ సిఫార్సు లేకపోతే... ఇదే నేను ఉద్యోగ వేటలో పడినప్పుడు ఎదురైన సమస్య. యూనివర్సిటీలో చదువు పూర్తిచేసి, బయటకి వచ్చిన నాకు దిక్కు తోచలేదు. ఏ ఉద్యోగమూ రాలేదు. 'అన్ని మంచి మార్కులు వచ్చినా ఇలా ఉన్నాను ఎందుకు?' అన్న ప్రశ్న తలెత్తింది.

దానికి కారణం- నన్ను ఉద్యోగంలో చేర్చుకొమ్మని చెప్పేందుకు తెలిసిన వాళ్ళెవరూ లేరు. అంత పెద్ద మనుషులతో పరిచయాలు నాబోటి వారికి ఎక్కడ నుండి వస్తాయి?

'గోరుచుట్టు మీద రోకటి పోట'న్నట్టు- మా నానమ్మ కూడా అప్పుడే చనిపోయింది. ఈ లోకంలో నాకంటూ మరెవరూ లేకపోవడం, నిరుద్యోగం- నన్ను మానసికంగా, ఆర్థికంగా బాగా చితికిపోయేలా చేశాయి. సరిగ్గా అప్పుడే కలిశారు మా దూరపు బంధువు గోవిందరాజులుగారు.

మా నానమ్మ చనిపోయినప్పుడు చూడటానికి వచ్చినాయన... నా గురించి వాకబు చేశారు. విషయం తెలిసి 'అరెరె... ఇంత మంచి కుర్రాడు ఖాళీగా ఉండిపోకూడదే' అనుకుని తనకు తెలిసినవారిని సంప్రదించి దేవాదాయ ధర్మాదాయ శాఖలో నాకో చిన్న ఉద్యోగం ఇప్పించారు.

గుళ్ళో పనే అయినా, నేను ఏనాడూ ఆ దేవుడికి మొక్కింది లేదు, కనీసం అటు వైపు చూసిందీ లేదు. నా పని మాత్రం నిబద్ధతతో చేసేవాడిని. ఆర్థికంగా కాస్త నిలదొక్కుకున్న రోజులవి. ఇంట్లోకి సోఫా, బీరువా, మంచం... ఒక్కొక్కటీ కొనుక్కోగలిగే స్తోమతా ధీమా వచ్చాయి.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఒంటరిగా బతకడం అలవాటైంది. ఏ తోడూ లేకుండా జీవితం మొత్తం ఇలాగే ఉండిపోవాలన్నది నా ఆలోచన. పెళ్ళి పిల్లలూ వాళ్ళ ఆలనా పాలనా నాకు సరిపడే పనులు కాదని అప్పట్లో నా అభిప్రాయం.

సరిగ్గా అదే సమయంలో ఒకరోజు గుళ్ళో ఒకమ్మాయిని చూశాను. చూడముచ్చటగా ఉంది. అంతవరకూ నేను ఓ ఆడపిల్లని



చూసి అంతగా చలించడం అన్నది జరగలేదు. అలాంటిది తొలిసారి నా మనసు ప్రేమ గురించి ఆలోచనలు చేసింది.

చిత్రం... ఆ అమ్మాయి కూడా గుడికి వచ్చినప్పుడల్లా నా వైపు చూసి పలకరింపుగా నవ్వడం, నాతో మాట కలపడం... మా మధ్య ప్రేమకి దారి తీశాయి. 'అనాథవీ గుమాస్తావీ నీకు పిల్లని ఎవడిస్తాడు' అన్న మాటలకి సిద్ధమయ్యే- వాళ్ళింట్లో మా సంగతి చెప్పాం. విచిత్రం... అలాంటివి ఏం లేకుండా వాళ్ళ నాన్న మా పెళ్ళికి వెంటనే ఒప్పేసుకున్నారు. పైగా కట్నం కూడా ఇస్తామన్నారు. నేను సున్నితంగా తిరస్కరించాను.

అనాథగా పెరిగిన నాకు ఒక తోడు దొరకడం చాలా కొత్తగా అనిపించింది. జీవితంలో అత్యంత మధురానుభూతులు నాకు కలిగినది పెళ్ళి తర్వాతే. ప్రేమా ఆప్యాయతా అనురాగమూ లాంటివి సినిమా టైటిల్స్‌కే పనికొస్తాయి అనుకున్న నాకు... నిజంగా అనుభవం అయినప్పుడుగానీ తెలియలేదు వాటి విలువ.

మా ఆనందాన్ని రెట్టింపు చేసేందుకా అన్నట్టుగా మాకో పాప పుట్టింది. కానీ పుట్టిన రెండు నెలలకే తనకి జబ్బు చేసింది. నెల రోజులు హాస్పిటల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి. మా ఆవిడ మొక్కని దేవుడు లేడు, తిరగని గుడి లేదు. నిజంగా దేవుడు ఉంటే ఇంత చిన్నపిల్లకి అంత పెద్ద శిక్ష వేస్తాడా? అసలు పుట్టించడం ఎందుకు, మళ్ళీ ఆ ప్రాణాన్ని బాధ పెట్టడం ఎందుకు? దేవుడే ఉంటే ఇలా జరిగేదే కాదు. అందుకే దేవుడు లేడనే నా నమ్మకం మరింత బలపడింది.

కానీ ఆ డాక్టర్ల పనితనమో మా పాప అదృష్టమో, తను బతికింది. చాలా ఆరోగ్యంగా ఇంటికి వచ్చింది. పెద్దవుతున్నకొద్దీ, మిగతా పిల్లలతో పోలిస్తే ఇంకాస్త చురుగ్గా హుషారుగా తిరిగేది. అది చూసి మాకు భలే ముచ్చటేసేది.

★ ★ ★

మా పాపకి అప్పుడు పదేళ్ళు. నాకు వచ్చే కొద్దిపాటి జీతం ఎందుకూ సరిపోవట్లేదు. పెరుగుతున్న ధరలూ చూడాల్సిన కూతురి భవిష్యత్తూ దృష్టిలో పెట్టుకుని విడిగా ఒక చిన్న వ్యాపారం మొదలు పెడదామని నా శ్రీమతి సలహా ఇచ్చింది.

తెలిసిన వారి దగ్గర నుండి అప్పు తెచ్చి, ఒక షాపు అద్దెకు తీసుకుని బట్టల వ్యాపారం మొదలుపెట్టాం. అప్పట్లో మా ఊళ్ళో ఒకటి రెండు షాపులే ఉండేవి, వాటిలో కూడా అన్ని వెరైటీలూ దొరికేవి కావు. ఇలా- వాళ్ళ లోపాలని మాలో లేకుండా జాగ్రత్త పడుతూ అంచెలంచెలుగా ఎదిగి, మూడేళ్ళలో ఇంకో షాపు తెరిచే స్థాయికి చేరాం. నేను కూడా ఉద్యోగం మానేసి పూర్తిగా ఇందులోనే ఉండిపోయాను.

అత్యాశ- మనిషిని ముంచేసే వాటిలో ముందు ఉంటుంది. ఉన్న దాంతో నేను తృప్తిపడక ఇంకా ఏదో చేయాలని, పెద్దగా పరిచయం లేని ఒక వ్యక్తితో కలిసి ఒక గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ పెట్టాను. కనీస అవగాహన లేకుండా, ఎదుటివ్యక్తి ఎలాంటి వాడో తెలియకుండా పెట్టిన ఆ కంపెనీ మూత పడటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

మళ్ళీ ఎక్కడ మొదలుపెట్టానో అక్కడికే వచ్చేశాను. మా ఆవిడ అప్పుడు కూడా ఆ దేవుడినే మొక్కింది, 'ఈ కష్టం నుండి బయట పడేయి ప్రభూ' అని.

'అసలు ఆ దేవుడే ఉంటే, ఆ మనిషి మనల్ని మోసం చేస్తున్నప్పుడు ఏం చేస్తున్నాడు? అప్పుడు రానివాడు ఇప్పుడెలా వస్తాడు?' అని నేను తనతో

వాదనకి దిగాను.

ఎక్కడి కోపం ఎక్కడ చూపిస్తున్నాను... మా ఆవిడ తన నమ్మకాలతో తానుంటే నేనెందుకు అడ్డుపడటం... ఎవరి పద్ధతులు వారివేననే నా సిద్ధాంతాలు ఏమయ్యాయి... ఓడిపోవడం నుండి వచ్చిన చిరాకా, లేక ఓటమిని ఒప్పుకోలేని అహంకారమా, లేక దేవుడు నాకేం చేశాడని వచ్చిన కోపమా... నాకే తెలియలేదు.

చాన్నాళ్ళక్రితం... ఎప్పుడో వ్యాపారం బాగున్నప్పుడు, నా చేత తక్కువ ధరకి నా ఫ్రెండ్ గోపాలం కొన్ని షేర్లు కొనిపించాడు. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి విలువ బాగా పెరిగిందంటూ అమ్మేయమని సలహా ఇచ్చాడు. వాటిని అమ్మేసి, తిరిగి నేను ఆ డబ్బులతో వ్యాపారం మొదలు పెట్టడానికి పోయిన సంపద తిరిగి సంపాదించడానికి రెండేళ్ళు కూడా పట్టలేదు.

ఇలా ఎగుడు దిగుడుగా జీవితం సాగిపోతూ వచ్చింది. అప్పుడప్పుడూ కొన్ని నష్టాలు కళ్ళచూసినా నా జీవితంలో ఎన్నో మధురస్మృతులు పోగు చేసుకున్నా. కూతురు గోల్డ్ మెడల్ సాధించడం, ఎంఎన్‌సీలో ఉద్యోగం సంపాదించడం, కోరుకున్న వరుడిని పెళ్ళి చేసుకుని తనకో కుటుంబాన్ని ఏర్పరచుకోవడం, ఎంత ఎదిగినా కన్న వాళ్ళమనే గౌరవం మా పట్ల ఉంచడం... ఇవన్నీ నాకు జీవితంలో మరచిపోలేని అంశాలే.

ఒక వ్యక్తిగా నేను పరిపూర్ణతను సాధించాను. నా జీవితంలో ఇల్లూ భార్యా కూతురూ మనవడూ అందరూ ఉన్నారు. బ్యాంకులో అవసరానికి మించిన డబ్బుంది. ఏ రోగమూ లేని ఆరోగ్యకరమైన శరీరం ఉంది. ఏ మనిషికైనా ఇంతకంటే కావల్సింది ఏముంటుంది?

దేవుడు అన్నవాడు నాకు నా అన్నవాళ్ళని లేకుండా చేసినా, ఫీజు కట్టడానికి కూడా డబ్బులు లేకుండా చేసినా, వ్యాపారంలో నష్టాలు తెప్పించినా- స్వయంశక్తితో నేను ఎదిగిన తీరు... నేను గర్వపడేలా చేస్తుంది. నాకు ఇప్పటికీ ఏ దేవుడి సాయం తీసుకోకుండా ఎదిగాను అనే ధీమా, ధైర్యం ఉంటాయి. నేను ఏ దేవుడికో లంచంగా ఒక కొబ్బరికాయ కొట్టి ఏ పనీ చేయించుకోలేదు. నా కష్టాన్నే నమ్ముకున్నాను. అదే నా బలం... ఇదే అభిప్రాయంతో ఇన్నాళ్ళూ బతికాను.

★ ★ ★

అరవై ఏళ్లల్లో నేను పడినవీ చూసినవీ అనుభవించినవీ ఒక్కసారి కళ్ళముందు కనపడటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంకా ఆ మాయ నన్ను వీడినట్టు లేదు. మైకంగానే ఉంది. చూస్తుంటే- ధ్వజస్తంభం, వెండి వాకిలి దాటి, ఆనంద నిలయంలోకి అడుగు పెట్టబోతున్నట్టున్నాం.

'ఓం నమో వేంకటేశాయ' నామం దివ్యంగా వినబడుతోండగా ఒక్కసారిగా నేను తూలి, పడకుండా నిలబడగలిగాను.

ఏదో స్వరం నాతో మాట్లాడుతోంది. రూపం కనబడటం లేదు. మాటే వినిపిస్తోంది.

'నీకు ఎవరూ లేరని ఎవర్రా అన్నది? నీకు అమ్మా నాన్నా లేకపోతే ఏమిరా? కనపడకుండా నిన్ను నడిపింది నేను కాదూ? కరణం కొడుకు చేత తప్పులు రాయించింది నేనే, అవి నీ చేత సరిచేయించింది నేనే. గోవిందరాజులు ద్వారా నీకు ఉద్యోగం ఇప్పించిందీ, నీ మామచేత నీకు పిల్లనిచ్చి పెళ్ళి చేయించిందీ నేనే. నీ కూతురి జబ్బు నయం చేసి నీకు తిరిగి అప్పగించిందీ నేనే. గోపాలం ద్వారా నీ చేత షేర్లు కొనిపించేలా చేసిందీ, వ్యాపారం మూతపడితే



వాటిని అమ్మించి, నువ్వు తిరిగి నిలబడగలిగేలా చేసిందీ నేనే.

నారు పోసిన వాడిని, నీరు పోయకుండా వదిలి పెడతానా?

నీకు కష్టం ఇచ్చేది నేను అయినప్పుడు దానికి పరిష్కారం చూపేది కూడా నేనే కదా. నువ్వు ఏడిస్తే నీ కన్నీరు తుడిచేదీ, నువ్వు ఓడిపోతే నీ భుజం తట్టేదీ, నీకు ఆపద వస్తే చేయి అడ్డుపెట్టేదీ, పడిపోతే లేపేదీ... అన్నీ నేనే. ఇంతటి బ్రహ్మాండాన్ని సృష్టించి, నడిపించి, లయం చేస్తూ ఉన్నవాడిని నిన్ను వదిలేస్తానా? నువ్వు నా బిడ్డవి కాదా? నువ్వు- 'దేవుడు లేడు, లేడు' అన్న ప్రతిసారీ నన్ను తల్చుకుంటూనే ఉన్నావు, నేను ఆలకిస్తూనే ఉన్నాను. కర్త, కర్మ, క్రియ అన్నీ నేనై నడిపిస్తుండగా ఇక నీకు భయమెలా ఉంటుంది? నీ జీవితం పరిపూర్ణం చేయడానికి నేను లేనా?'

చెప్పాలనుకున్నది నాకు తెలియజేసి ఆ స్వరం ఆగిపోయింది. నా హృదయాంత రాళాల్లో మారుమోగిన ఈ మాటలు చెప్పింది ఎవరు? నిజంగా నా జీవితంలో నా అంతట నేను చేసింది ఏదీ లేదా? అంతా ఆ శ్రీహరి నాటకమేనా? ఆ జగన్నాటక సూత్రధారి నా చేత చేయించిన పనులేనా నా జీవితం?

ఆలోచిస్తుండగా- తొమ్మిదిన్నర అడుగుల స్వామి ధృవ బేరం నా కళ్ళ ముందు ఉంది. లోకంలో ఇంతకంటే అపురూపమైన దృశ్యం మరొకటి లేదు అన్నట్టుగా ఉంది. నా మెదడు స్తంభించిపోయింది. చుట్టూ ఉన్న హోరు వినిపించడం లేదు. పట్టు వస్త్రాల్లో శంఖు చక్రాలు ధరించి, లక్ష్మీదేవిని హృదయంలో పెట్టుకున్న ఆ 'ఆపద మొక్కులవాడే' కనిపిస్తున్నాడు. అతడి నయనమనోహరమైన రూపమే గోచరిస్తోంది.

అప్రయత్నంగా చేతులు రెండూ జోడించాను. 'అనాథ రక్షక' అన్నది ఉత్త పేరు కాదు, దాన్ని సార్థకం చేసుకున్నవాడు ఆ స్వామి అని తెలిసి వచ్చింది. అందుకు నా జీవితమే నిదర్శనం.

'అన్నీ నేనే, అంతా చేసింది నేనే' అనుకున్న నా జీవితంలో నాకు ఆత్మబంధువుగా ఉంటూ, నన్ను నడిపిస్తూ నా తప్పులు దిద్దుతూ సరైన దారిలో నడిపింది ఆ గోవిందుడే... అని తెలిసిన ఆ క్షణం అపురూపం, అనుపమానం. అరవై ఏళ్లల్లో తెలుసుకోలేని సత్యాలని అరక్షణంలో తెలిసేలా చేశాడు. ఇది నాకు అర్థం కావడానికి జీవిత కాలం పట్టిందా...' అని నా మీద నాకే సిగ్గేసింది.

ఇక మీదటైనా ఆయన విలువ తెలుసుకుని మసలుకుంటానని మాటిచ్చి కదులుతుండగా మరింత స్పష్టంగా కనిపించింది స్వామి రూపం. ఆయన పాదాల చెంత అంతర్వాహినిగా ప్రవహించే విరజా నది నా కన్నుల్లో ఏర్లై పొంగింది. ఆ నీటితోపాటు నా మనసులో పేరుకున్న అజ్ఞానం కూడా బయటకి పోయింది. నా మనసు పునీతం అయింది.

"అమ్మా, తాత ఏడుస్తున్నారు" నా మనవడు నన్ను చూసి అంటున్నాడు. నా కూతురు కూడా ఆశ్చర్యంగా చూస్తోంది. వాళ్ళకేం తెలుసు- లోలోపల నాతో నేనే చేసిన యుద్ధం ఈనాటికి పూర్తయి నేను నిజమైన పరిపూర్ణత సాధించానని?

'నాహం కర్తా హరిః కర్తా
తత్పూజా కర్మ చాఖిలం
తదాపి మత్కృతా పూజా
తత్ప్రసాదేన నా అన్యథా'

నేను కాదు కర్తని. చేసేదీ చేయించేదీ అంతా ఆ శ్రీహరే. నా ద్వారా ఏ సత్కార్యం జరిగినా అది భగవంతుడి ప్రసాదమే తప్ప వేరేమీ కాదు- అని ఓ పుస్తకంలో చదివిన శ్లోకం గుర్తొచ్చింది. ఆ శ్లోకాన్ని మననం చేసుకుంటూ గుండెలు నిండిన భక్తిభావనతో సంతృప్తిగా సంతోషంగా ముందుకు కదిలాను. ★

చేసేద్దామా... స్ట్రీట్‌ఫుడ్!

సాయంత్రం కాగానే సరదాగా బయటకు వెళ్లి... వేడివేడిగా ఏవైనా మసాలా పదార్థాలు తినాలనిపించే సీజన్ ఇది. అలాగని రోజూ వెళ్లాలంటే మాటలా.. అందుకే ఆ రుచులేవో ఇంట్లోనే తయారుచేద్దాం రండి.



చీజ్ పనీర్ సమోసా

కావలసినవి: మైదా: ఒకటిన్నర కప్పు, ఉప్పు: తగినంత, నూనె: వేయించేందుకు సరిపడా.

స్టఫింగ్‌కోసం: పనీర్ తురుము: కప్పు, చీజ్ తురుము: కప్పు, ఉడికించిన స్వీట్ కార్న్: అరకప్పు, క్యాప్సికం ముక్కలు: పావు కప్పు, పచ్చిమిర్చి తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, చిల్లీఫ్లేక్స్: రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు: పావుకప్పు, ఉప్పు: తగినంత, మిరియాలపొడి: అరచెంచా, చాట్‌మసాలా: అరచెంచా.

తయారీ విధానం: ఓ గిన్నెలో మైదా, ఉప్పు వేసుకుని నీళ్లు పోస్తూ చపాతీ పిండిలా చేసుకోవాలి. పైన రెండు చెంచాల నూనె వేసి మరోసారి కలిపి మూత పెట్టాలి. అదేవిధంగా స్టఫింగ్ కోసం పెట్టుకున్న పదార్థాలను ఓ గిన్నెలో తీసుకుని కలుపుకోవాలి. కొద్దిగా మైదా పిండిని తీసుకుని పల్చని చపాతీలా ఒత్తి... చాకుతో మధ్యకు కట్‌చేయాలి. ఒక్కో ముక్కను త్రికోణం ఆకారంలో చేసుకుని అందులో రెండుచెంచాల పనీర్ మిశ్రమాన్ని ఉంచి.. అంచుల్ని మూసి ఊడిపోకుండా తడిచేత్తో అద్దాలి. ఇలా అన్నింటినీ చేసుకుని రెండుమూడు చొప్పున కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి.

గుడ్డు పొంగనాలు



కావలసినవి: గుడ్లు: మూడు, జీలకర్ర: పావు చెంచా, మిరియాలపొడి: అరచెంచా, పచ్చిమిర్చి: రెండు, వెల్లుల్లి రెబ్బలు: మూడు, క్యారెట్ తురుము: చెంచా, ఉల్లిపాయముక్కలు: టేబుల్‌స్పూను, క్యాప్సికం తరుగు: టేబుల్‌స్పూను, క్యాబేజీ తరుగు: టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు: టేబుల్‌స్పూను, ఉప్పు: తగినంత, వెన్న: టేబుల్‌స్పూను, పాలకూర తరుగు: పావుకప్పు, నూనె: రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి వెన్న వేసి జీలకర్ర వేయించాలి. ఇందులో పచ్చిమిర్చి, వెల్లుల్లి తరుగు, క్యారెట్‌తురుము, ఉల్లిపాయముక్కలు, క్యాబేజీ తరుగు, క్యాప్సికం తరుగు, కొత్తిమీర తరుగు, పాలకూర తరుగు వేసి వేయించి అయిదు నిమిషాలయ్యాక దింపేయాలి. తర్వాత గుడ్ల సొన, ఉప్పు, మిరియాలపొడి వేసి బాగా గిలకొట్టాలి. ఈ మిశ్రమాన్ని గుంట పొంగనాల పాన్‌లో సగం వరకూ నింపి నూనెతో ఎర్రగా కాల్చుకుని తీసుకోవాలి.

చికెన్ షావర్మా రోల్

కావలసినవి: చికెన్ బ్రెస్ట్: 300 గ్రా, పెరుగు: అరకప్పు, కారం: చెంచా, వెల్లుల్లిపొడి: చెంచా, చిల్లీఫ్లేక్స్: చెంచా, చికెన్ టిక్కా మసాలా: చెంచా, మిరియాలపొడి: అరచెంచా, జీలకర్రపొడి: అరచెంచా, నిమ్మరసం: చెంచా, ఉప్పు: తగినంత (అన్నింటినీ ఓ గిన్నెలో వేసుకుని బాగా కలిపి అరగంటసేపు నాననివ్వాలి), నూనె: అరకప్పు, వెల్లుల్లి - ఎండుమిర్చి కారం: రెండు చెంచాలు, పల్చగా ఒత్తుకున్న మైదా చపాతీలు: ఏడెనిమిది, క్యారెట్: ఒకటి, క్యాప్సికం: ఒకటి, టొమాటో: ఒకటి, క్యాబేజీ తరుగు: అరకప్పు, ఉల్లిపాయ: ఒకటి.

సాస్‌కోసం: పెరుగు: అరకప్పు, మయొనైజ్: అరకప్పు, నిమ్మరసం: చెంచా, వెల్లుల్లి: రెండు, నువ్వులు: టేబుల్‌స్పూను, నూనె: టేబుల్‌స్పూను. (వీటిని మిక్సీలో వేసుకుని క్రీమ్ తరహాలో చేసుకోవాలి).

తయారీవిధానం: స్టవ్ మీద పాన్‌ను పెట్టి రెండు పెద్ద చెంచాల నూనె వేసి.. చికెన్ బ్రెస్ట్‌ను ఉంచి రెండువైపులా ఎర్రగా కాల్చుకుని ఆ తరువాత ముక్కల్లా చేసుకోవాలి. వీటిపైన సన్నగా పొడుగ్గా కోసిన కూరగాయ ముక్కలు, క్యాబేజీ తరుగు వేసుకుని కలుపుకోవాలి. ఒక చపాతీని పెనంపైన ఉంచి నూనెతో కాల్చుకుని తీసుకోవాలి. దీనిపైన కొద్దిగా వెల్లుల్లి కారం, సాస్ రాసి రెండు టేబుల్‌స్పూన్ల చికెన్ మిశ్రమాన్ని ఉంచి, మరికొంచెం సాస్ వేసి రోల్‌లా చుట్టాలి. ఇలాగే మిగిలిన వాటినీ చేసుకోవాలి.





మసాలా పనీర్ పావ్ భాజీ

కావలసినవి: పావ్‌భాజీ బన్నులు: రెండు, నూనె: రెండు చెంచాలు, వెన్న: రెండు టేబుల్‌స్పూన్లు, కసూరీమేథీ: రెండు చెంచాలు, పావ్‌భాజీ మసాలా: రెండున్నర చెంచాలు, ఉల్లిపాయముక్కలు: అరకప్పు, అల్లంవెల్లుల్లి పేస్టు: చెంచా, పసుపు: పావుచెంచా, కారం: అరచెంచా, ఉప్పు: తగినంత, క్యాప్సికం తరుగు: పావుకప్పు, సన్నగా తరగిన టొమాటో ముక్కలు: కప్పు, పనీర్‌ముక్కలు: అరకప్పు, కొత్తిమీర తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, నిమ్మరసం: రెండు చెంచాలు, చీజ్‌తురుము: రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె, టేబుల్‌స్పూను వెన్న, చెంచా కసూరీమేథీ, రెండు చెంచాల పావ్‌భాజీ మసాలా వేసి వేయించాలి. ఇందులో అల్లంవెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి కలపాలి. క్యాప్సికం తరుగు, టొమాటో ముక్కలు, పనీర్‌ముక్కలు, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి కలిపి గ్రేవీలా అయ్యాక దింపేయాలి. స్టవ్‌మీద పాన్‌ను పెట్టి మిగిలిన వెన్న, కసూరీమేథీ, పావ్‌భాజీ మసాలా వేయాలి. బన్నుల్ని మధ్యకు కోసి పాన్‌పైన ఉంచి ఎర్రగా కాల్చుకుని తీసుకోవాలి. ఈ బన్నుల మధ్య చేసుకున్న మసాలాను ఉంచి, చీజ్‌తురుము చల్లి మధ్యకు మడిచి మరో రెండు నిమిషాలు కాల్చి తీసుకోవాలి.

హాయ్ బుజ్జీ


రింగులెన్ని?

ఇక్కడో పాప హులాహూప్స్‌తో ఆడుకుంటోంది కదూ! బొమ్మలో మొత్తం ఎన్ని రింగులున్నాయో లెక్కించండి చూద్దాం.



దాగుడుమూతలు

చిన్నారులంతా పార్కులో సరదాగా గడుపుతున్నారు కదూ! ఇక్కడున్న వస్తువులు బొమ్మలో దాగున్నాయి. అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి చూద్దాం.



తేడాలేంటి?

ఈ కింది బొమ్మల్లో ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?



ఫస్టే కదా..!

రమ: అమ్మా... నేను ఫస్ట్ వస్తే చాక్లెట్లు ఇస్తానని చెప్పావు కదా...

అమ్మ: వావ్... ఫస్టొచ్చావా... ఇవిగో తీసుకో...

రమ: థ్యాంక్స్ అమ్మా...

అమ్మ: ఏదీ నీ ప్రోగ్రెస్ కార్డు చూపించు ఒకసారి...


రమ: ప్రోగ్రెస్ కార్డేంటమ్మా... నేను ఫస్ట్ వచ్చింది క్లాస్‌లోంచి బయటకు...

అమ్మ: ఆc..!



దారి కనుక్కోండి

ఓ ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న వ్యక్తిని పోలీసు కుక్క వెంబడిస్తోంది. దారిలో ఉన్న బాంబులను తప్పించుకుంటూ, దొంగను పట్టుకునే మార్గాన్ని దానికి చూపరూ!



అవి ఏవి?



ఇక్కడ రకరకాల ఫ్లేవర్లతో ఐస్‌క్రీములు నోరూరిస్తున్నాయి కదూ! అయితే, వాటిల్లో రెండు మాత్రమే ఒకేలా ఉన్నాయి. అవి ఏవో కనుక్కోండి చూద్దాం.

పోలికలేంటి?

కింది బొమ్మల్లో అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న వాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



నిజాయతీ

అనగనగా ఓ పట్నం. అక్కడ రామయ్య, వీరయ్య అనే ఇద్దరు పెద్ద వ్యాపారులు ఉండేవారు. నువ్వా నేనా అన్నట్లు వారి మధ్య ఎప్పుడూ పోటీ ఉండేది. వీరయ్య దగ్గర పనిచేసే గుమస్తా గంగులు... తనకు జీతం కాస్త పెంచమని ఎన్నో నెలల నుంచి యజమానిని అడుగుతున్నాడు. కానీ, ఆయన మాత్రం చూద్దాం చేద్దాం అంటూ ప్రతి నెలా దాటవేయసాగాడు. దీంతో విసుగు చెందిన గంగులు... ఇక లాభం లేదనుకొని అక్కడ పని మానేశాడు. కొద్దిరోజుల తర్వాత అలవాటైన పని కావడంతో మరో వ్యాపారి రామయ్య దగ్గరకు వెళ్లాడు. విషయం మొత్తం చెప్పి... పని ఉంటే ఇవ్వమని అడిగాడు. తను ఎంత జీతం ఆశిస్తున్నాడో కూడా చెప్పాడు. ఆయన కాస్త ఆలోచించి... 'కొద్ది నెలల తర్వాత మళ్లీ జీతం పెంచమని అడగవనే గ్యారంటీ ఏంటి?' అన్నాడు. 'కుటుంబం గడవడం కష్టంగా అనిపిస్తే, అడగడంలో తప్పు లేదని అనుకుంటున్నానయ్యా...' సమాధానమిచ్చాడు గంగులు. 'అది సరే... మరి నిన్ను పనిలోకి తీసుకుంటే నాకేమైనా లాభం ఉందా?' అని అడిగాడాయన. అర్థం కాలేదన్నట్లు ముఖం పెట్టాడు గంగులు. 'నిన్ను పనిలోకి తీసుకుంటే, అక్కడి వ్యాపార రహస్యాలు ఏమైనా చెప్పగలవా?' అని అడిగాడు. 'అయ్యా... నిన్నటి వరకూ నాకు అన్నం పెట్టిన యజమానికి ద్రోహం చెయ్యలేను. నేను నీతి తప్పే మనిషిని కాదయ్యా, క్షమించండి' అన్నాడు గంగులు. ఆ జవాబుతో రామయ్య నవ్వుతూ... 'శభాష్ గంగులూ... నీ నిజాయతీ నాకు నచ్చింది. ఈరోజు నుంచే నువ్వు పనిలో చేరొచ్చు. జీతం కూడా నువ్వు అడిగిన దానికంటే కాస్త ఎక్కువే ఇస్తాను' అనడంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడతను. ఆలస్యం చేయకుండా అదే రోజు పనిలో చేరాడు. నిబద్ధత కలిగిన పనివాడిని పోగొట్టుకున్నందుకు బాధపడ్డాడు వీరయ్య.



రంగులేద్దాం



జవాబులు


తేడాలేంటి?: 1. టీచర్ డ్రెస్‌పైనున్న డిజైన్ 2. పాప కుర్చీ 3. చేప దిశ 4. టేబుల్ పైనున్న ఆకు 5. కుండీ 6. బాబు చెయ్యి 7. ఇంక్ బాటిల్ 8. పాప డ్రెస్ కలర్.

పోలికలేంటి?: అడ్డం: కప్‌కేకు, గిఫ్టుబాక్సు, నిచ్చెన; నిలువు: గొడుగు, డ్రమ్స్, కుర్చీ; ఐమూల: కారు బొమ్మ, హెడ్‌సెట్.

దాగుడుమూతలు: మబ్బులో చెఫ్ టోపీ, ఫెన్సింగ్ కర్రగా కొవ్వొత్తి, బాబు కాళ్ల దగ్గరున్న పొదలో బ్రష్, బాబు ప్యాంట్‌పైన గ్లవ్, బాబు తలపైనున్న మబ్బులో కుందేలు, చెట్టు కాండంపైన స్పూన్, బండరాయిపైన గొడుగు, చెట్టు కొమ్మలో సుత్తి.

రింగులెన్ని?: 35


అవి ఏవి?



సమీక్ష

అందమైన కలలు


పోషించలేనేమో అని నాన్న, కెరీర్‌కు అడ్డంకి అవుతుందేమో అని అమ్మ... ఇలా ఏదో ఓ కారణంతో కన్నవారు రెండో బిడ్డకు జన్మనివ్వడం మానేస్తే - ప్రతి ఇల్లూ 'సింగిల్ చైల్డ్'తో చిన్నబోతుంది. ఆ బాబుకో, పాపకో తోడు లేకుండా పోతుంది. స్నేహితులు ఉంటే ఉండొచ్చు కానీ, తోబుట్టువు తోబుట్టువేగా!



చంద్రశేఖర అజాద్ 'ఏంజెల్' నవల కూడా ఓ కౌమార బాలిక ఒంటరి భావనతోనే ఆరంభం అవుతుంది. తనకు చిట్టి తమ్ముడో, బుజ్జి చెల్లాయో వస్తే బావుండని కోరుకునే మహిత అనే టీనేజ్ అమ్మాయి కలల చుట్టూ తిరుగుతుంది. కుటుంబ బంధాలూ, అభిప్రాయభేదాలూ, ఇరుగూపొరుగూ, ఆర్థిక పరిస్థితులూ.. ఇలా అనేక విషయాల్ని సందర్భోచితంగా చర్చించారు రచయిత. ఓ దేవకన్య పాత్రను సృష్టించి... మహిత తన ఆశల్నీ, ఆలోచనల్నీ, భయాల్నీ పంచుకునే అవకాశం ఇచ్చారు. టీనేజ్‌లో చిగురించే ప్రేమ భావనల్ని ప్రస్తావించారు. జీవన నైపుణ్యాల అవసరాన్ని కూడా నొక్కి చెప్పారు. పుస్తకాన్ని చదువుతుంటే, ఓ కౌమార బాలిక మనతో మాట్లాడుతున్న భావన కలుగుతుంది.

ఏంజెల్
రచన: పి.చంద్రశేఖర అజాద్
పేజీలు: 131, వెల: రూ.175
ప్రతులకు: ఫోన్: 9246573575


స్వేచ్ఛావాది అంతరంగం



సంపన్న కుటుంబంలో పుట్టారు. డూన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. చార్టర్డ్ అకౌంటెన్సీ చదవడానికి ఇంగ్లండ్ వెళ్లారు. మరి, ఆతర్వాత? మరొకరైతే, కార్పొరేట్ ప్రపంచంలో పైపైకి ఎగబాకాలని ఆరాటపడేవారు. కానీ, కోబడ్ గాంధీ మాత్రం... అక్కడ ఉన్నప్పుడే జాత్యహంకారాన్ని ప్రశ్నించారు. తిరిగొచ్చాక కూడా అదే పంథాను కొనసాగించారు. వామపక్ష వాదం వైపు నిలబడ్డారు. వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపారు. ఆ స్వరం పాలకులకు కంపరం కలిగించింది. ఇంకేముంది, జైలు నోరు తెరుచుకుంది. ఆ ఉద్యమకారుడిని ఓ దశాబ్దం పాటూ నిర్బంధించింది. ఊచల వెనక ఉన్నప్పుడు ఆయన అక్షరరూపమిచ్చిన పుస్తకం పేరు 'ఫ్రాక్చర్డ్ ఫ్రీడం'. ఆ రచనకు పద్మజ షా తెలుగు అనువాదమిది.

బీటలువారిన స్వేచ్ఛ
రచన: కోబడ్ గాంధీ; అనువాదం: పద్మజ షా
పేజీలు: 247, వెల: రూ.250
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు


అహో ఆంధ్రభోజా...



కృష్ణదేవరాయల్ని తలుచుకుంటే... రతనాలు రాశులుగా పోసి అమ్మిన హంపీ వీధులు హృదయనేత్రాల ముందు సాక్షాత్కరిస్తాయి. అష్టదిగ్గజాల కావ్యపఠనం మనసు చెవుల్లో మార్మోగుతుంది. ఇవి కాకుండా విజయనగర వైభవాన్ని చాటే కథలూ, గాథలూ. డాక్టర్ జి.వి.పూర్ణచందు 'భువన విజయం' రాయలకాలం నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సారస్వత మహోజ్వల స్థితిని సాధికారికంగా నిర్ధారిస్తుంది. దాంతోపాటే అభూత కల్పనల్నీ, అవాస్తవాల్నీ కొట్టిపారేస్తుంది. ఏలినవారి ముద్దుల తనయ మోహనాంగి ముచ్చట్లనూ, తెలుగు భోజుడు కొలిచిన ఆంధ్రమహావిష్ణువు ఘనతనూ ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంది. ఆనెగొందిలోని రాజ కుటుంబీకుల్నీ పరిచయం చేస్తుంది.

భువనవిజయం
రచన: డాక్టర్ జి.వి.పూర్ణచందు
పేజీలు: 184, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

సామాన్యుల కథలు



మధ్యతరగతి బతుకులు ఇతివృత్తాల అక్షయపాత్రలు. ఆ జీవితాల గురించి ఎంత రాసినా, ఇంకా మిగిలే ఉంటుంది. విహారి తన కథా రచనకు ఈ ముడిసరుకునే ఎంచుకున్నారు. 'నిప్పు నుంచి నీరు' సంకలనం నిండా మిడిల్‌క్లాస్ కష్టసుఖాలే కనిపిస్తాయి. 'అవతలి గట్టు'... కాస్త స్వేచ్ఛను శ్వాసిస్తూ, కించిత్ కొత్తను ప్రేమించే స్వాతి అనే అమ్మాయి కథ. 'గాలిచేటు' కరోనా రోజుల్ని గుర్తుకు తెస్తుంది. 'చివరి తీర్పు' అన్నాచెల్లెళ్ల అనుబంధాల కథ. టాలెంట్ షోల పోకడలూ, మదపిచ్చి మొగుడి ఆగడాలూ, మళ్లీ చదువుకోవాలని ఆశించే ఓ అమ్మ ఆరాటాలూ... ఇలా అనేక కోణాలు సంపుటిలో పలకరిస్తాయి.

నిప్పు నుంచి నీరు
(కథా సంపుటి); రచన: విహారి
పేజీలు: 155, వెల: రూ. 200
ప్రతులకు: ఫోన్: 9848025600

బుక్‌షెల్ఫ్

సావిత్రిబాయి ఫూలే
రచన: డా. కత్తి పద్మారావు
పేజీలు: 700, వెల: రూ.600
ప్రతులకు: ఫోన్: 9849741695

సినీ మాటామంతీ-I
రచన: ఎమ్బీయస్ ప్రసాద్
పేజీలు: 248, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9000413413

విశేష (అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి)
రచన: పెనుగొండ లక్ష్మీనారాయణ; పేజీలు: 180, వెల: రూ.160
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

హైకూలు; రచన: డాక్టర్ లంకా శివరామప్రసాద్
పేజీలు: 113, వెల: రూ.200; ప్రతులకు: ఫోన్: 6305677926

భక్తి కవులు-తత్త్వకవులు... సామాజిక భూమిక
రచన: డాక్టర్ ఎస్.నారాయణరెడ్డి; పేజీలు: 262, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9949166104

పుట్టపర్తి రచనలలో భారతీయ సంస్కృతి
రచన: పుట్టపర్తి నాగపద్మిని; పేజీలు: 230, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 7893976644

నారీమణులకు నీరాజనం
సంపాదకులు: సి.గంగ, జె. చెన్నయ్య
పేజీలు: 191, వెల: రూ.150
ప్రతులకు: నవోదయ, నవచేతన పుస్తక కేంద్రాలు

నవ్వుల సందడి (కార్టూన్లు)
కార్టూనిస్ట్: గోపాలకృష్ణ
పేజీలు: 125, వెల: రూ.290

నవ్వుల జంక్షన్ (కార్టూన్లు)
కార్టూనిస్ట్: వర్చస్వి
పేజీలు: 147, వెల: రూ.290
ప్రతులకు: అమెజన్, ఫ్లిప్‌కార్ట్

రాశి ఫలం

గ్రహబలం
(జులై 6 - 12)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

అత్యుత్తమ సమయం. ఆశయం నెరవేరుతుంది. కాలం కలిసొస్తుంది. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రతిభను కనబరుస్తారు. ప్రస్తుత పెట్టుబడులు భవిష్యత్తులో లాభాలను కురిపిస్తాయి. ఏలినాటి శని ప్రభావం ఉంది కాబట్టి, ఆచితూచి అడుగేయాలి. ముఖ్య విషయాల్లో ఆత్మీయుల భాగస్వామ్యం అవసరం. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అదృష్ట కాలం కొనసాగుతోంది. ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. పాత నిర్ణయాలకు కట్టుబడి ఉండండి. దైవానుగ్రహం ముందుకు నడిపిస్తుంది. నలుగురిలో పేరు తెచ్చుకుంటారు. ఓ ఇబ్బంది నుంచి బయటపడతారు. శ్రేయోభిలాషులు మేలు చేస్తారు. విష్ణు సహస్రనామం చదువుకోండి.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మనోబలంతో ముందుకు సాగండి. బలమైన ప్రయత్నంతో ఉన్నత విజయాలు సాధిస్తారు. అనవసర విషయాల్లో జోక్యం వద్దు. ఇతరుల లోపాలను పెద్ద మనసుతో ఆమోదించండి. అపార్థాలు సృష్టించేవారితో జాగ్రత్త. ఆర్థిక వ్యవహారాల్లో లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. సుబ్రహ్మణ్య స్తోత్రం పారాయణం చేయండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టయోగం కొనసాగుతోంది. శుభాలు జరుగుతాయి. ఆర్థిక ఫలితాలు అనుకూలం. ఉద్యోగంలో గుర్తింపు లభిస్తుంది. ఆశయాలు నెరవేరతాయి. బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. వివాదాలకు ఆస్కారం ఇవ్వకండి. సున్నితంగా సంభాషించండి. ఆరంభశూరత్వం పనికిరాదు. మహాలక్ష్మిని ధ్యానించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

అత్యుత్తమ సమయం. విజయాలు సిద్ధిస్తాయి. వ్యాపారంలో గణనీయమైన లాభాలను గడిస్తారు. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. కీర్తిప్రతిష్ఠలు సంపాదిస్తారు. పిల్లలకు సంబంధించిన శుభవార్తలు వింటారు. అనవసర ఆలోచనలతో కాలాన్ని వృథా చేసుకోవద్దు. అధికార లాభం సూచితం. మహాలక్ష్మిని ధ్యానించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభప్రదమైన కాలం. ఆశయాలు ఒక్కొక్కటిగా నెరవేరతాయి. ఆత్మబలంతో అవరోధాలను అధిగమిస్తారు. శత్రుదోషం తొలగుతుంది. మిత్రుల అండదండలు పెరుగుతాయి. ఆలోచనల్లో స్పష్టత అవసరం. దీర్ఘకాలిక పెట్టుబడుల గురించి ఆలోచిస్తారు. వివాదాలకు దూరంగా ఉండండి. వేంకటేశ్వరస్వామిని పూజించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపారయోగం ఉంది. బుద్ధిబలంతో వ్యవహరిస్తారు. వృత్తి, ఉద్యోగాల్లో మీ పరిధి విస్తరిస్తుంది. ధనస్థానంలో ఉన్న బుధయోగం మేలు చేస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అధిక వ్యయాలు కూడా సూచితం. ఆత్మీయులతో విభేదాలకు ఆస్కారం ఉంది. జాగ్రత్తగా మెలగండి. నలుగురికీ చేతనైనంత సాయం చేస్తారు. సూర్యభగవానుడిని ఆరాధించండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

విజయాలు సిద్ధిస్తాయి. ప్రయత్నాలు కలిసొస్తాయి. పదవీలాభం సూచితం. గతంలో ఆగిపోయిన పనుల్లో మళ్లీ కదలిక వస్తుంది. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకండి. ఆర్థిక నష్టాల్ని అధిగమిస్తారు. భూ, గృహ, వాహన యోగాలు ఉన్నాయి. దూర ప్రయాణాలు లాభదాయకం. పరిస్థితుల్ని బట్టి నిర్ణయాల్ని సమీక్షించండి. లక్ష్మీనారాయణులను స్మరించండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

వ్యాపారయోగం శుభప్రదం. ఉన్నతస్థితి గోచరిస్తోంది. కొత్త ప్రయత్నాలు సఫలం అవుతాయి. తోటివారి ప్రోత్సాహం అందుతుంది. బుద్ధిబలంతో వ్యవహరిస్తారు. గృహ, వాహనాది యోగాలు ఉన్నాయి. వివాదాలకు దూరంగా ఉండండి. చెడు ఆలోచనలు వద్దు. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. ఆస్తులు వృద్ధి చెందుతాయి. సూర్యనారాయణుడిని స్మరించండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

శుక్రయోగం లాభాలను ప్రసాదిస్తుంది. గతంలో తీసుకున్న ఆర్థిక నిర్ణయాలు ఉత్తమ ఫలితాలను అందిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో అప్రమత్తత అవసరం. చాలా సందర్భాల్లో మౌనమే ఉత్తమం. చిన్నపాటి విభేదాలతో చిరకాల స్నేహితులు దూరం కావచ్చు. కాలం మిశ్రమంగా ఉండటం వల్ల, ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

దైవశక్తి తోడుగా నిలుస్తుంది. ఆత్మీయుల సహకారం అందుతుంది. కాలం కొంత వ్యతిరేకంగా ఉంది కాబట్టి, ఆచితూచి వ్యవహరించాలి. ఒత్తిడి వల్ల పొరపాట్లు జరిగే ఆస్కారం ఉంది. వినయవిధేయతలు చాలా ముఖ్యం. నిందలు మోపేవారితో జాగ్రత్త. వ్యాపార వ్యవహారాల్లో ఇతరులపైన ఆధారపడకండి. నవగ్రహ స్తోత్రాలను పఠించండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

లక్ష్మీయోగం బలంగా ఉంది. ఆర్థిక విజయాలు సాధిస్తారు. వాయిదా మనస్తత్వం పనికిరాదు. ఉద్యోగంలో శుభ ఫలితాలు అందుకుంటారు. నిర్ణయాల్లో చంచలత్వం వద్దు. కొన్నిసార్లు ఒకటి చేయబోతే మరొకటి అవుతుంది. అయినా, నిరాశపడకండి. బలమైన ప్రణాళికతో సమస్యల నుంచి బయటపడతారు. పరమేశ్వరుడిని ధ్యానించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. కొండ (3)
3. మహిళ (3)
5. ఏదో ఒక పనితో పొద్దుపుచ్చడం (4)
8. లేత, చిన్న, శైశవం (2)
10. కంటకాలు (2)
11. పరివారం, బలగం (2)
12. హస్తినాపురంలో కృష్ణుడు మెచ్చిన దాసీపుత్రుడు చెప్పిన నీతుల సంకలనం (5)
14. కోడిగుడ్డులోని ద్రవం (2)
15. అడ్డం 11తో ఆలయం (1)
17. పుట్టినరోజున పిల్లలు ఇష్టంగా కోసేది! (2)
20. పావురం (3)
21. ఈ పండు తొనలను కొందరు మహా ఇష్టంగా తింటారు (3)
23. గుర్రం శిరస్సు కలిగిన దేవుడు (4)
24. వత్తు పోయినా మత్తే (2)
25. దుఃఖం, క్లేశం (2)
26. అంధకారం (3)
28. జడత్వం, చేతన లేకపోవడం (4)
30. కుంట, చెరువు (3)
32. మిసైళ్ళు, రాకెట్లు (4)
34. దిక్కు (2)
36. హస్తం, చెయ్యి (2)
37. ఒక పెద్ద పక్షి... నిశిత దృష్టికి ప్రసిద్ధి (2)
39. పచ్చడి చెయ్యాలంటే ఈ కాయలు కావాల్సిందే (3)
42. శ్వేతం (3)
43. తెలుగు సంవత్సరాల్లో తొమ్మిదోది (2)
45. సక్రమం కానిది (3)
47. పర్వదినాలు (4)
48. అడ్డం 15తో వర్ణం (1)
49. వేగం (2)
50. ఉక్కిరిబిక్కిరి (4)
51. అడ్డం 48తో అంధత్వం (1)
52. ప్రతిమ, బొమ్మ (2)

1		2	■	3	4		■	5		6	7
	■	8	9	■		■	10		■	11	
12	13				■	14		■	15	■	
■		■		■	16	■	17	18	■	19	■
20			■	21		22	■	23			
24		■	25		■	26	27		■		■
	■	28			29	■		■	30		31
32	33			■	34	35	■	36		■	
■		■	37	38	■	39	40		■	41	■
42			■	43	44	■		■	45		46
■		■	47				■	48	■	49	
50				■		■	51	■	52		■

నిలువు

1. ఉన్నతస్థితి; అధికార హోదా (3)
2. గుంపు, సమూహం (3)
4. వెర్రి, పిచ్చి (2)
5. పాదాలు (2)
6. కుశలం (2)
7. తీగజాతి మొక్కలు పైకి అల్లుకోవడానికి కర్రలు పాతి వేసేది? (3)
9. మధ్యలో గుడిదీర్ఘం అదనంగా చేరినా సినిమానే (3)
10. నీళ్ళలో- 'మునగడమే' (3)
13. యముడి వాహనం (4)
16. అడవి (2)
18. గుహ, బిలం (3)
19. వాలి తమ్ముడు (4)
20. పద్మం వంటి కన్నులు కలిగిన పడతి (4)
21. దోషి, దుష్కర్మలకు పాల్పడిన స్త్రీ (3)
22. భార్య (2)
25. కృష్ణుడికి అటుకులు ఇచ్చిన బాల్యమిత్రుడే! (4)
27. మాయ, బూటకం (2)
28. రెండొంతుల 'అణువు' (2)
29. నందివర్ధనంలో ముక్కంటి వాహనం (2)
30. ఆభరణాల్లో విలువైన రాయి; సర్వ శ్రేష్ఠం (2)
31. ప్రవృత్తి, స్వభావం (2)
33. నిద్రలో మాట్లాడటం (5)
35. 'జమ్మి' చెట్టు (2)
36. శిశువు, బాల (2)
38. ఆకాశ మార్గాన ప్రయాణిస్తూ కిందకు ఉమ్మి కృష్ణుడి ఆగ్రహానికి గురైనవాడు? (3)
40. చారు (2)
41. రాజులకు రాజు (4)
44. మామిడిపిండె రుచి (3)
46. అంగడి, విపణి, దుకాణం (2)
47. పట్టుదల (2)

సుడొకు

		2	7	8				
8	5		3			2		7
3	1		6		9		8	
		5		7				9
			9		8			
7				5		8		
	2		4		7		1	3
1		6			2		5	4
				1	3	6		

గతవారం సమాధానాలు

పదకేళి


1 క	డ	2 వ	✿	3 ద్రం	✿	4 మా	5 స	ప	6 త్రి	క	✿
డ	✿	7 ద	రి	✿	8 దు	ర్గ	మం	✿	దం	✿	9 పు
10 నం	11 ద	నం	✿	12 తె	✿	13 ద	గా	14 ప	డి	15 స	✿
✿	బ్బ	✿	16 దూ	ర	17 ద	ర్శి	✿	ర	✿	18 వ	ల
19 అ	నం	20 త	రం	✿	ర్పం	✿	21 ఉ	మా	22 ప	తి	✿
వ	✿	మి	✿	23 త్రై	✿	24 శౌ	✿	25 నం	ది	✿	26 దా
27 ని	28 రా	ద	రం	✿	29 గు	రి	30 వెం	ద	✿	31 మ	హి
32 జ	మ	✿	✿	33 కు	డి	✿	34 క	య్యా	35 లు	✿	త్రు
✿	36 దా	37 వా	38 న	లం	✿	39 గు	న్న	✿	40 ఆ	41 వా	లు
42 అ	సు	రు	లు	✿	43 జా	ణ	✿	44 అ	✿	ర	✿
లు	✿	ణీ	✿	45 మ	గు	వ	✿	46 ల	వ	ణా	ద్రి
47 గు	ట్టు	✿	48 మి	న్ను	✿	49 తి	ల	లు	✿	సి	✿

సుడొకు

5	1	4	2	9	3	7	6	8
3	9	8	7	6	5	2	1	4
7	6	2	8	4	1	3	9	5
6	4	3	9	1	2	5	8	7
9	2	7	5	8	4	1	3	6
8	5	1	6	3	7	9	4	2
4	7	6	1	5	9	8	2	3
2	8	9	3	7	6	4	5	1
1	3	5	4	2	8	6	7	9

జాలీ జాలీగా... జిగ్‌జాగ్ రిసార్టులో!







విలాసవంతమైన గదులూ, లగ్జరీ ఫర్నిచర్, విశాలమైన బాల్కనీలూ, మోడర్న్ ఈత కొలనులతో ఉండే రిసార్టుల్లో గడపడమే మరిచిపోలేని అనుభూతి. అలాంటిది సముద్రతీరంలో ఎత్తయిన కొండ మీద వినూత్నమైన నిర్మాణశైలిలోని రిసార్టులో సేదతీరడం అంటే- పర్యటకులకు ఇంకెంత గమ్మత్తుగా ఉంటుందో కదా! ఆ ఆనందాన్ని ఇవ్వడానికే ఈతరం ఆర్కిటెక్ట్స్ ఓ సరికొత్త రిసార్ట్‌ని డిజైన్ చేశారు. అల్బేనియాలోని హిమారే నగరం సమీపంలో ఉన్న సముద్రతీరంలో జిగ్‌జాగ్ రిసార్ట్ పేరుతో దీన్ని నిర్మించారు. ఫైవ్‌స్టార్ హోటల్ హంగులూ, సకల సౌకర్యాలూ, జిగ్‌జాగ్ నిర్మాణాలతో అలరించే ఈ రిసార్ట్ పర్యటకులకు నిజంగా ఓ స్వర్గధామమే!



ఒకవైపు నీలి సముద్రం... మరోవైపు పచ్చటి అడవి... ఆ రెండు అందాలనూ ఒకేసారి ఆస్వాదించాలనుకునే ప్రకృతి ప్రేమికులు అండమాన్‌కి వెళ్లాల్సిందే. అక్కడి హావ్‌లాక్ ద్వీపంలో ఉన్న రాధానగర్ బీచ్ మనదేశంలోనే అత్యద్భుత సముద్రతీరం. తెల్లటి ఇసుక దారుల్లో నడుస్తూ, చుట్టూరా కనువిందు చేసే ప్రకృతి అందాల్ని కెమెరాల్లో బంధిస్తూ ఎంజాయ్ చేస్తుంటారు ఇక్కడికొచ్చిన సందర్శకులంతా!

